# మృగతృష్ణ

లారీ పరుగులు తీస్తోంది.

ఆకాశపు కొలిమిలో కాలిన యినుపముద్దలా సూర్యుడు భగభగా మండు తున్నాడు.

దిగంతరేఖను శరణుజొచ్చిన కొండలు, గుట్టలు...

యెండవేడికి పొగలు గక్కుతున్న నల్లరేగడి నేల...

కరుడుగట్టిన కాఠిన్యంలా బిర్రబిగుసుకున్న బీళ్లు...

అక్కడక్కడా, యిష్టారాజ్యంగా తలలెగరేస్తున్న ముళ్లచెట్లు...

కనుచూపు మేరలో పచ్చని పట్టెక్కడా కనిపించడం లేదు.

చేలకు అడ్డంపడి పరిగెడుతోంది లారీ.

దూరంగా ధూళి మేఘమొకటి పరుగులుతీస్తోంది. ఆ మేఘంలోపల లైన్ యిన్‌స్పెక్టరు జీపు చిక్కుపడి పోయి వుంది. తాను రేపుకున్న దుమ్ములో తానే తగులుకుపోయి, యెలా వెళ్లాలో తెలియని పరిస్థితిలో పిచ్చి పట్టినట్టుగా పరిగెడుతోంది జీపు.

చేల గుండెలపై జీపు గీసిన వాతల నాధారంగా చేసుకుని లారీ పరిగెడుతోంది.

లారీ బాడీలో వాడిపోయిన వరినారు కట్టల్లా ప్రిసయిడింగ్ ఆఫీసర్లూ, అసిస్టెంటు ప్రిసయిడింగ్ ఆఫీసర్లూ గోనెమూటల్ని కావిలించుకుని సోలిపోయి వున్నారు.

బాయినెట్లను చిందరవందరగా పారేసి, వీలయినంత యెక్కువ స్థలాన్ని ఆక్రమించు కుని కూర్చున్న పోలీసులు మాత్రం అక్కడికక్కడ వొక ప్రపంచాన్ని సృష్టించుకున్నారు.

రెండు మూడేళ్ల క్రితమే రిక్రూటయినట్టుగా కనిపిస్తున్న కుర్ర పోలీసులు టైరు పైకెక్కి కూచుని బూతుపాటల్ని తన్మయత్వంతో పాడుకుంటున్నారు. మిగలినవాళ్లు కుర్రాళ్లను ఉత్తేజపరచడం కోసం పగలబడి నవ్వుతున్నారు.

పెద్దగా కారుబారు చేస్తూ లారీ వో చోట ఆగిపోయింది.

''డ్రైవరు నా కొడుక్కేమయిందంట?'' వో పోలీసు విసుక్కున్నాడు.

''పెండ్లాం సమర్తాడిందంట!'' అంటూ పైకిలేచి కిందికి తొంగిచూసిన కుర్ర పోలీసాకడు ''లారీ దోవతప్పింది. డ్రైవర్నాకొడుకు దారి తప్పించేసినాడోచ్...'' అంటూ పరవశంతో ప్రకటించాడు.

నఖశిఖ పర్యంతమూ నల్లరేగడి దుమ్ముతో మేకప్ చేసుకున్న ప్రిసయిడింగ్ ఆఫీసర్లు భయం భయంగా కళ్లు తెరిచి, చుట్టూ బిత్తరచూపుల్ని చూడసాగారు.

వో చేత్తో టోపీ తీసి పట్టుకుని, మరో చేత్తో బట్టతలకు పట్టిన చెమటను చేతిగుడ్డతో తుడుచుకుంటూ, కేబిన్‌లోంచి కిందికి దిగిన పోలీసినస్పెక్టరు ''దెయ్యం మొగమేసుకుని చూస్తా నిలబడితే పనిసాగదు. కిందికిదిగి టైరు కిందికి రాళ్లు తొయ్యండి'' అంటూ ఆర్డరు జారీచేశాడు. చెమటతో తడిసిన అతడి యూనిఫాం నల్లరేగడి దుమ్ము అతుక్కు పోవడంతో నల్లగా తయారైపోయి వుంది.

''తొండాకులు పట్టేవాళ్లనంతా లైనినస్పెక్టర్లుగా వేస్తే యింకేమవతాది? యెనక్కి తిరిగి చూడకుండా యెట్ల పోతావుండాడో జూడు? యీ డొంకల్లో హెవీవెహికల్ యెట్ల పడతాది? యీ రాళ్ల వంకలో జీపు పోయినట్లుగా లారీ పోతాదా? దిగండి... రాళ్లు తోస్తేనేగానీ లారీ కదల్దు...'' తిట్టుకుంటూ కుర్ర పోలీసాకడు కిందికి దిగాడు.

వోసారి పైకిలేచి, దుమ్ము విదిలించుకుని, రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ''యింకా యెంతదూరముంది?'' అని అడిగాను.

''అప్పుడే యేమయింది? యింకా ఫస్టుస్టేషనే రాలేదు'' పక్కన కూర్చున్న పోలీసు సమాధానం చెప్పాడు. బీడీముక్కను చివరిసారిగా వోసారి పీల్చి కిందికి పారేసిన తరువాత ''మీదే వూరు?'' అని అడిగాడు.

''మూడుచింతలపల్లె'' అన్నాను.

''నా డ్యూటీగూడా ఆడ్నేసార్! నేను వుద్యోగం జేసేదికూడా ఆడ్నే! యేందట్లా జూస్తారు? ఆ వూర్లో పోలీసుస్టేషనుండాదిలెండి. నాపేరు చిదంబరయ్య. ముందు కోటకొమ్మలపల్లి పోవాల. మళ్ల పెద్దవెంకటాపురం. పెద్దవెంకటాపురంనుంచి చినెంకటాపురం పోయి, మళ్లా పెదెంకటాపురం రావాల. ఆపైన మూడుచింతలపల్లె...''

''పొద్దున తొమ్మిది గంటలప్పుడెప్పుడో మొదలయిన ప్రయాణం, టైం మూడవుతోంది. కారులోగానయితే హైద్రాబాదుకే వెళ్లుండొచ్చు...'' యేడో నెంబరు పోలింగు బూతు తాలూకు గోనెసంచి పైన సోలిపోయిన పెద్దాయన వాపోసాగాడు. ఆయన లేబరాఫీసరు. స్టే తెచ్చుకుని సర్వీసులో కొనసాగుతున్నందుకు మొదటిసారిగా పశ్చాత్తాపపడుతున్నట్టున్నాడు.

''రాకెట్టయితే చంద్రమండలానికే పొయ్యుండచ్చు సార్... అంతా జే.ఎస్.చౌదరి పుణ్యం. చచ్చి యేలోకానుండాడో యేమోగానీ, తరతరాలకు గుర్తుండిపోయే పనిచేసేసి పోయినాడు'' బాక్‌డోర్‌కు చేరగిలబడిపోతూ కానిస్టేబుల్ చిదంబరయ్య చేతులు జోడించాడు.

''జే. యస్. చౌదరంటే యెండోమెంట్స్ మినిస్టరుగా వుండే వాడే,ఆయనేనా?'' లేబరాఫీసరు ప్రశ్నించాడు.

''ఆ మహానుభావుడే సార్! యీ యేరియా అంతా రెడ్ల ప్రపంచం. చచ్చి గీపెట్టినా వేరేవోళ్లకు వోటు పడదు. నిజానికి దుర్గ వరానికంటే తాటిచెర్లకే యిది దగ్గిర. కానీ నాయుళ్లెక్కువగా వుండే పెదమల్లెపాడును తాటిచెర్ల నియోజకవర్గానికి కలుపుకొని దీన్ని దుర్గవరానికి జాయింట్ చేసేసినాడు. అబ్బ సొమ్ము కొడుకులు పంచుకున్నట్టుగా... దుర్గవరంనుంచీ యీ ఏరియాకు రావాలంటే యింత నరకమూ అనుభవించాల్సిందే! వానిదేం పోయింది? వొళ్లు నీదిగాకపోతే, కాశీదాకా పాకొచ్చు....''

దారికడ్డం పడిన రాళ్లను పక్కకు నెట్టే పని పూర్తయిన తరువాత, పోలీసులు పట్టు దొరకడం కోసం టైర్ల కిందికి రాళ్లు దొర్లించసాగారు.

''అయితే యీ ప్రాంతానికి బస్సు రోడ్డుకూడా లేదా?'' అని అడిగాను.

''పేరుకైతే వుండాది. కానీ ఆ దోవలో పొయ్యేదానికంటే యిదే మేలు. ఆ రోడ్డులో గానయ్యుంటే యిప్పటికి యేకీలుకాకీలు వూడిపోయున్ను. పైగా యీ మూడో నెంబరు రూట్‌ను కవర్ జెయ్యాలంటే రోడ్డుదారి లాభంలేదు. యీ లైనినస్పెక్టర్ది యీ ప్రాంతమే! అందుకే యీ దారి కనిపెట్టినాడు'' అన్నాడు చిదంబరయ్య.

పని పూర్తయిన తరువాత, లారీ పైకెక్కి కూర్చున్న కుర్ర పోలీసొకడు మళ్లీ బూతుపాటను మొదలుపెట్టాడు. ముందుకెళ్లనని మొండికేస్తున్న లారీని డ్రైవరు గేర్ రాడ్‌తో మొటికలు వేసి ముందుకు కదిలించేశాడు.

''దాహంగా ఉంది. వాటర్ బాటిల్ యెవరిదగ్గరయినా వుందో లేదో...'' అంటూ వాపోయాడు లేబరాఫీసరు స్వగతంలో -

''యింకో కాల్గంట వోపిక పట్టండి సార్. అదిగో ఆ మిట్టెక్కి దిగితే కోటకొమ్మలపల్లి కనబడతాది'' అన్నాడు చిదంబరయ్య.

పదిహేను నిమిషాల ప్రయాణం తరువాత లారీ కోటకొమ్మలపల్లి చేరింది.

మట్టి అన్నది కనిపించకుండా నాపరాళ్లతో పేర్చిన గోడలు. పైకప్పుపైన సొడుమట్టి... కిటికీలు సైతం లేవు... యిండ్లు దాదాపు సమాధుల్లా కనిపిస్తున్నాయి.... యిండ్ల చుట్టూ ముళ్లచెట్లు...

''యీ ముళ్లచెట్లని మెచ్చుకోవాలనిపిస్తోంది'' అన్నాను.

యెందుకన్నట్టుగా చూశాడు చిదంబరయ్య.

''వానచుక్క పడకపోయినా యీ చెట్టుకు భయం లేదు. బీళ్లలో కూడా బతికి బట్టగడుతోంది. చూడబోతే యెడారుల్లో కూడా యిది చలాయించుకునే ట్టుంది ...'' అన్నాను.

''దీన్ని మేమంతా గవర్మెంటు ముండ్లచెట్లని పిలస్తాం సార్. మీకు తెలుసునో తెలియదో, యీ యేరియా అంతా యింక కొన్ని యేండ్లలో యెడారయి పోతాదంట! సైంటిస్టులు చెప్తా వుండారని పేపర్లో యేసినారు...''

లారీ శబ్దం వినిపించగానే యిళ్లల్లోంచి జనం బయటకొచ్చి నిల్చున్నారు.

యే శరీరంపైనగానీ చినగని బట్టలేదు. మాసిన బట్టలకు మాటుగావడం కోసమన్నట్టుగా యెముకలు బయటపడుతున్న శరీరాలు.

జీపు దిగిన లైనినాస్పెక్టరు ''యేడో నెంబరు పోలింగు స్టేషను పోలింగాఫీస రెవురు?'' అంటూ కేకేశాడు.

''యిదేనా యేడో నెంబరు? యిక్కడ పోలింగు స్టేషను యెక్కడుంది?'' లేబరాఫీసరు పైకి లేచి చుట్టూ కలియజూడసాగాడు.

''కిందికిదిగండిసార్! యిదే పోలింగుస్టేషను. మీ అసిస్టెంటెవురు? మీ సామాన్లెక్కడ?..''

పడిపోవడానికి సిద్ధంగా వున్న వో మట్టిమిద్దెలోకి సామాన్లన్నీ చేరిన తరువాత, వో పెద్ద చార్టు తీసుకుని వివరాల్ని చూసుకోసాగాడు లైనినాస్పెక్టరు.

''యిక్కడ మేము యెండలో కూచునుండాము తండ్రీ! తొందరగా తెములు...'' లారీ బాడీలోంచి యెవరో గగ్గోలు పెడుతున్నారు.

''యిదేనా స్కూలు బిల్డింగు... తలుపులెక్కడ? కుర్చీలూ టేబుళ్లూ యెక్కడున్నాయి? రాత్రికి సామాన్లనెక్కడ వుంచుకోవాలి? కిటికీ తలుపులుకూడా లేని యీ మట్టిమిద్దెలో నాకూ సామాన్లకూ సేఫ్టీ ఏముంది?'' కోటకొమ్మలపల్లి పోలింగుస్టేషను ప్రిసయిడింగ్ ఆఫీసరు వొకదాని వెంట వొకటిగా ప్రశ్నల్ని సంధిస్తూనే వున్నాడు. అన్నింటికి సమాధాన మిదేనన్నట్టుగా, లైనినాస్పెక్టరు జీపు పెద్దగా శబ్దం చేస్తూ ముందుకు కదిలింది.

లారీ వెనక్కు తిరిగేటంత వరకూ పోలింగుస్టేషన్నే చూస్తూ వుండిపోయిన చిదంబరయ్య ''చచ్చి గొడ్డు!'' అంటూ కిసుక్కుమని నవ్వేశాడు.

''యిదంతా క్రిటికల్ యేరియానా?'' భయపడుతూ అడిగాను.

''రొచ్చుకొంప. కోటకొమ్మలపల్లె అంటే కూలోళ్ల పల్లె అని అర్థం. తెల్లారి లేస్తానే సగం మంది పెదెంకటాపురానికీ, సగంమంది చిన వెంకటాపురానికి పోవాల్సిందే! రెండూళ్లకూ మధ్య జన్మాంతర వైరం. పోలీసోళ్లకు రోజూ పనే అక్కడ! రెండూ రెండు పార్టీలు... వాళ్లకూలోళ్లూ, వీళ్లకూలోళ్లూ యీ వూళ్లో తన్నుకొని చస్తారు. పోయిన యెలక్షన్లప్పుడు రెండు ఖూనీలు జరిగినాయి. పోలింగు కాన్సిలయింది. రెండో రోజు పోలీసు ప్రొటెక్షన్లో రీపోలింగు జరిగింది. చూసేదానికి ప్రిసయిడింగు ఆఫీసరు మెత్తటోడుగా వుండాడు. వొంట్లో యెంత సత్తావుండాదో, వూళ్లో వాళ్లు వొకసారి పట్టి చూసిగాని వదిలిపెట్టరు...'' అదేదో ఆనందకరమైన విషయమైనట్టుగా చిదంబరయ్య నవ్వుతూనే వున్నాడు.

లారీ చేలను వదలిపెట్టి మట్టిబాట పైకొచ్చింది. రోడ్డుకిరువైపులనుంచీ సీమతంగేడు చెట్లకొమ్మలు లారీలోని జనాల్ని పరామర్శించసాగాయి. కొమ్మలు తగిలి వొళ్లు చీరుకుపోయినప్పుడల్లా పోలీసులు కేరింతలు కొట్టసాగారు.

''యిదేనా బస్సు రోడ్డు?'' అని అడిగాను.

''అనుమానమెందుకు సార్?'' అన్నాడు చిదంబరయ్య.

రెండుమూడు మైళ్ల దూరాన్నుంచీ పెద్దవెంకటాపురం తాలూకు మిద్దెలు కనిపించ సాగాయి.

''చూసేదానికి అట్లాకనిపిస్తాదిగానీ, యీ యిలాకాకంతా పెదెంకటాపురమే బెంగుళూరూ మద్రాసూ స్మగుల్డు గూడ్సు కాణ్ణించీ నాటుసారాయి దాకా దుడ్డుంటే యేంది గావాలంటే అది దొరకతాది. వూళ్లోవుండే పెదరెడ్లంతా పొద్దన్నే మూతి గడుక్కోని నాస్తాకు మోటారుబైకెక్కి టౌనుకు పోతారు. అంత టెక్కు మనుషులు. వూళ్లో రెండు బ్రాందీషాపులుండాయి. అంతటి వ్యాపారం తాటిచెర్లలో గూడా జరగదు...'' చిదంబరయ్య చెప్పుకుపోసాగాడు.

పెద్ద వెంకటాపురంలో సైతం నల్లటి బండరాళ్లతో కట్టిన మట్టి మిద్దెలే యెక్కువగా కనిపించాయి. సమాధుల్లాంటి మట్టి మిద్దెల మధ్య జయకేతనాల్లాంటి మహిడీలు కొన్ని రొమ్ము విరుచుకుని నిల్చుని వున్నాయి.

దారిపక్కన కనిపించిన టీ హోటల్లో బన్ రొట్టెలుతిని, టీలు తాగిన తరువాత ప్రిసయిడింగ్ ఆఫీసర్లూ, అసిస్టెంటు ప్రిసయిడింగ్ ఆఫీసర్లూ కొంచెం తెపరాయించు కోగలిగారు. ప్రొద్దున తయారుచేసిన యిడ్లీలు దోసెలనుంచీ, నిన్నటి వడలవరకూ టీ హోటల్లో దొరికిన ప్రతి తినుబండారాన్నీ మాయంచేసి పారేసిన తరువాత రెండు మూడు టీలనొకటిగా కలిపి తాగేసిన పోలీసులు గడబిడ చేసి పారేస్తున్నారు.

పెద్ద వెంకటాపురం నుంచి చిన్న వెంకటాపురం వెళ్లిరావడానికి మరో గంటసేపు పట్టింది.

''యింకో అరగంటలో మన మూడు చింతలపల్లె వచ్చేస్తాది. రెడీగా వుండండి సార్...'' అన్నాడు చిదంబరయ్య.

కొంతసేపు తటపటాయించిన తరువాత, అతడివైపుకు వొంగి -

''మూడుచింతలపల్లె యెలాంటి వూరో నీకు తెలుసా చిదంబరయ్యా'' అని అడిగాను.

''మీకేం భయంలేదు లెండి సార్! పోలింగు ఆ వూర్లో పీస్‌ఫుల్‌గా జరిగిపోతాది. మీరు గెస్టు మాదిరిగా కూసోనుంటే చాలు. అంతా వాళ్లే చేసుకుని పోతారు. రాజకుమార్రెడ్డి సాయంగా వచ్చి పోలింగుస్టేషనులో కూచున్నాడంటే, కుయ్యికయ్యిమనే ధయిర్నమెవురి కుంటాది? పులొచ్చి కూచున్నట్టే! టయానికి మీల్సు మిమ్మల్ని యెతుక్కోని వచ్చేస్తాది... అది సరే, మీరు పీనా, యెస్పీనా?''

''నేనా...''

''యెస్పీయేగదా! ఆ మాట చెప్పండి ముందు. కోడిని కోసెయ్యమంటాను. మనం చెప్పాల్సిన పనే లేదులెండి! అంతా మీరే చూడబోతా వుండారుగదా! తినబోతావుండే టప్పుడు రుచి సంగతి యిప్పుడెందుకు లెండి! మొత్తానికి మీరు లక్కీసార్! పోయిన తడవ యెలెక్షన్లప్పుడు యీయేరియాలో రప్చర్ జరగని స్టేషను అదొకటే!... రాజకుమార్రెడ్డంటే

జిల్లాకంతా పెద్దపేరు...''

చిదంబరయ్య మాటల్తో ధైర్యాన్ని పుంజుకోగలిగాను.

''చుట్టుపక్కలెక్కడా పచ్చిక మొలక గూడా కనిపించడం లేదు. వీళ్లంతా యెలా బతుకుతున్నారు?'' చాలాసేపటినుంచీ వేధిస్తున్న ప్రశ్నను వెలిబుచ్చాను.

''యిదంతా తొండాకులు గుడ్లుపెట్టే నేల సార్! యీ బీళ్లల్లో వానలు కురిసినప్పుడు బీదా బిక్కీ చెనిక్కాయలు, జొన్నలు, సజ్జ పండించుకుంటారు. తూర్పుగా మూడు మైళ్ల దూరంలో కెనాలుండాది. అక్కడ పత్తి బాగా పండతాది. వొక్కో ఆసామికి యాభై అర్వై యెకరాల భూముండాది అక్కడ. మన రాజకుమార్రెడ్డికి ఆడ్నే నూటయాభై యెకరాలుండాదని అంటారు కొందరు. కొందరైతే లెక్కబెట్లేమని గూడా అంటారు. తెల్లారితే యీ పల్లెల్లో వుండే జనవంతా ఆడికిపోవాల్సిందే! పత్తి పంటంటే, చానా పనులుంటాయిలెండి! పొద్దు తిరిగేసరికి పది రూపాయలకు తక్కువగాకుండా ఆడా మగా సంపాదించుకోని రావచ్చు. ఆ మహానుభావుడేగాని లేకుంటే, యీ జనం అతీగతీ చూసేవాడెవుడుండాడు సార్? అందరూ చెంబూ తప్పేలాలెత్తుకుని దేశాంతరం పోవాల్సిందే గదా?...''

కాస్సేపటి తరువాత మరో అనుమానం మొలకెత్తింది. ''మూడుచింతలపల్లెలో పోలీస్టేషను గూడా వుందన్నావు గదా నువ్వు?'' అని అడిగాను.

''మా పుణ్యంకొద్దీ వుండాది లెండి సార్! రెండేండ్లనుంచీ ఆడ్నే బతకతా వుండన్నేను... ఛ ... అదీవొక బతుకేనా? వొక అంగిడుండాదా? సినిమా కొట్టా యుండాదా? తేలు కుడితే మందిచ్చే దిక్కుండాదా? ఆ వల్లకాట్లో పోలీస్టేషను పెట్టి మాకు వనవాసం శిక్ష యేసేసినారు దొంగనాయాండ్లు...''

''పోలీస్టేషనుగూడా వుందన్నావుగదా! నేను పెద్ద వూరేమోననుకున్నాను...''

''అదొక వూరా సార్! యీడ్చి కొలిస్తే యాభై యిండ్లుండవు. యెప్పుడో మా నాయనోళ్ల తరంలో యీ యేరియాలో పెద్ద మూమెంటుండేదంట! అప్పుడు టేషన్ పెట్టినారు. యిప్పుడది పనిష్మెంటు కింద మాలాంటోళ్లను దొంగల్దోలేదానికి పనికొస్తా వుండాది... వచ్చేసినాం సార్.. దగ్గిర్లోకొచ్చేసినాం. తట్టా బుట్టా సర్దుకోండి...'' తన బోయినెట్‌ను వెతుక్కోవడం కోసం చిదంబరయ్య పైకి లేచాడు.

లారీకంటే ముందుగా మూడు చింతలపల్లెను పరామర్శించిన జీపులోంచీ ''పద్మూడో నెంబరు పోలింగుస్టేషను. పి.ఓ యెవురు?''అంటూ లైనినస్పెక్టరు గొంతు చించుకున్నాడు.

''నేనేనండీ!... దిగేస్తున్నాను... మా లగేజీ యిక్కడే వుంది. దించుకోవాలి...'' అంటూ పైకి లేచాను.

''మారయ్యా! మూట దించుకో...''

''యెత్తెయ్యండి సార్! దించుకుంటాను'' ముందుకొచ్చాడో వ్యక్తి.

''వీడేసార్ మీకు ప్యూను. యీ వూళ్లో తోటోడు. మారయ్యా! సార్ హెళ్లకు మీల్సు టిఫిన్లూ అన్నీ నువ్వే గమనించుకోవాల. చెప్పిందంతా గుర్తుందిగదా?'' లైనినస్పెక్టరు పరిచయాల్ని పూర్తిచేశాడు. అంతలో యేదో జ్ఞాపకం వచ్చిన వాడిలా ''మీ యేపీవో యెవరండి?'' అంటూ ప్రశ్నించాడు.

''నేనేసార్! నేనెప్పుడో దిగేసినాను...'' యేపీవో సమాధానం చెప్పాడు.

''సుబ్బరాజు!... మీరేనా? వెరీగుడ్! యిదే సార్ స్కూలు. మారయ్యతో చెప్తే రాత్రికి లైట్ల సంగతి చూస్తాడు. వుదయం నేను మళ్లా కనిపిస్తాను. మీకేం భయం లేదు. అన్నిటికీ మారయ్యుంటాడు. ప్రొటెక్షనుకు కానిస్టేబులుంటాడు. మేము బయల్దేరతాము. డ్రైవర్! రైట్‌రైట్...''

జీపు ముందుకు కదిలింది.

పరిగెడుతున్న బిడ్డను పట్టుకోవడం కోసం వుుందుకురికే తల్లిలా, లారీ జీపు ననుసరించింది.

## 2

వీధి మధ్యలో పెద్ద చింతచెట్టుంది.

దానిచుట్టూ నాపరాళ్లతో కట్టిన రచ్చబండ...

చింతచెట్టు కటువైపున అన్నీ మట్టిమిద్దెలే! అయిదడుగుల మనుషులు సైతం తలవంచుకుని గుమ్మం లోంచీ లోనికడుగుపెట్టక తప్పదు. లోపలేముందో తెలియ నివ్వకుండా చీకటే కొలువుతీరి కూచుంది. యిండ్లముందున్న యెత్తరుగుల వరండాల్లో గోడలకు చేరగిలబడిన వోటి నులకమంచాలు కనిపిస్తున్నాయి. పెళ్లలూడి పోయిన గోడల రంగు కనిపెట్టడం దుస్సాధ్యమనిపిస్తోంది.

రచ్చబండ కిటువైపున స్కూలు బిల్డింగు... సన్నగా పొడుగ్గా గారమిద్దె... అడ్డంగా రెండు గోడలు కట్టి దాన్ని మూడు గదులుగా విభజించారు. వుత్తరం వైపున్న గదిలో పశువుల ఆస్పత్రిగూడా సర్దుకుపోయింది.

వాహనాల శబ్దం వినిపించగానే ఇళ్లలోని జనమంతా బయటికొచ్చి నిల్చున్నారు.

''యీ మూటను యిస్కూల్లోపల పెట్టేస్తాను సార్!'' అంటూ పలకరించాడు మారయ్య.

వెనుదిరిగి చూశాను.

నల్లని చేవబారిన ఆకారం... పుల్లటి పంచె... పైన గాడా చొక్కా... గాలికి వూగిస లాడుతున్న దీపాల్లాంటి కళ్లు... బితుకు బితుకుమంటున్న చూపులు... దూది తీసేసిన పత్తికాయలాంటి ముఖం...

''యిస్కూల్లో గాకపోతే యింకెక్కడ పెడ్తావు? సరైన తోటోడే దొరికినావులే! పద పద''

అసిస్టెంటు ప్రిసయిడింగ్ ఆఫీసరు సుబ్బరాజు హడావిడి పడిపో సాగాడు.

స్కూలు లోపలికెళ్లి కుర్చీలో కూర్చున్నాను

కుర్చీకెదురుగా సగం చిరిగిపోయిన దేశపటం వేలాడుతోంది. మరోవైపున తొలి ప్రధాని ఫోటో వేలాడుతోంది. చాక్‌పీసు స్పర్శను కలకాలంగా మరచిపోయిన నల్లబల్ల వో మూలగా నక్కి నిద్రపోతోంది. పైకప్పు మూలల్లో సాలెగూళ్లు వేలాడుతున్నాయి.

''మా స్కూలు యెట్లుండాది సార్?'' మంచినీళ్ల సత్తు చెంబుతో బాటూ ప్రవేశించాడు చిదంబరయ్య

సమాధానం చెప్పే వోపిక లేకపోయింది.

చెంబునందుకుని గుటగుటా సగం నీళ్లు ఖాళీ చేసేశాక ''నీళ్లు తియ్యగా వున్నాయి...'' అన్నాను.

''యెందుకుండవు సార్! బోరింగు నీళ్లు... యిన్నూటయాభై అడుగుల్లో పడింది జల... యీ వూరికంతా ఆ బోరింగు నీళ్లే ఆదరువు...''

చెంబులో మిగిలిన సగం నీళ్లు సుబ్బరాజుకు సరిపోయాయి.

''ముందు పదిబారల వైరూ, ఒక బల్బూ సంపాదించు చిదంబరయ్యా! రాత్రికి లైటు అరేంజి చేసుకుందాం'' అన్నాడు సుబ్బరాజు.

ఖాళీ చెంబుతో చిదంబరయ్య వెళ్లిపోయాడు.

''యీ స్కూల్లో వైరింగ్ చేసినట్టు లేరు. పక్కింటిలోంచి వైరు తీసుకోవలసిందేనా?'' అని అడిగాను.

''పక్కింటిలోనించా? భలేవాళ్లే సార్ మీరు? యెలెక్షన్ క్లాసులో తాసిల్దారు యేం చెప్పినాడో మరచిపోయినారా మీరు? యీ యిలాకాలో యెవురింటికీ ఫీజుల్లేవు. లైన్లు డిస్కనెక్టు చేసిన యిండ్లే యెక్కువ. రెండు వైర్లు తీసుకుని, కరెంటు పోలెక్కి రెండు లైన్లమీదా వేసేస్తే యింట్లో దీపం వెలిగిపోతాది. తాసిల్దారు గూడా మనల్ని ఆ ప్రకారమే లైటు అరేంజి చేసుకోమని చెప్పినాడు. చూడబోతే మీరు యెలెక్షను క్లాసులకు డుమ్కీ గొట్టేసినట్టుండారు'' సుబ్బరాజు నవ్వసాగాడు.

''నేను మొదటి క్లాసుకు రాలేదు సార్... రెండో క్లాసుకు మాత్రమే వచ్చాను'' అంటూ సంజాయిషీ చెప్పుకున్నాను.

''యింతకూ మీకు రెండు క్లాసుల లెక్కిచ్చినారా? లేకపోతే వొక క్లాసు లెక్క వాళ్లే మింగేసినారా?''

''వొక క్లాసుకే వచ్చానని ఆ క్లర్కుకు చెప్పాను. అయినా నిజం చెప్పినందుకు మా లెక్చరరొకాయన నాలుగు చీవాట్లు తగిలించి, రెండు క్లాసుల డబ్బు యిప్పించాడు''

''చాలామందికి అట్లనే యిచ్చినారు సార్! యిందులో తప్పులేదు లెండి! యెలక్షను లెక్కకు ఆడిట్ గీడిట్ యేమీ వుండదు. ఎవుడికి దొరికింది వాడు బీజారుకోవాల...

అయినా రెవిన్యూ డిపార్టుమెంటోళ్ల లెక్క పెద్దపులి భాగమయితే మనకిచ్చే లెక్క గుంతనక్క భాగమంత గూడా వుండదు. మనమయితే యింక్‌పాడ్‌కూ, యింకూ, పెన్సిలు ఆఖరుకు అట్టముక్కలకు గూడా లెక్క విలావరిగా జెప్పాల... వాళ్లనడిగే నాధుడు లేడు...''

పెద్ద బక్కెట్టు నీళ్లతో ప్రత్యక్షమయ్యాడు మారయ్య.

''నీళ్లీ పక్కపెట్టాను సార్... ముఖం గడుక్కోండి...'' అన్నాడు.

సంచిలోంచీ సోపూ, టవులూ తీసుకుని స్కూలు వెనుకవైపు దారిగుండా పెరట్లో కెళ్లాను.

స్కూలు బిల్డింగు నానుకుని, వెనుకవైపున సన్నటి కాలువొకటుంది. అందులో నీళ్లు లేవు. యెడారి అనే సముద్రానికి అది వుపనదిలా కనిపిస్తోంది. కాలువకు అరఫర్లాంగు దూరంలో చింతతోపొకటి కనిపించింది. అందులో పాత పెంకుటిల్లొకటి కనిపిస్తోంది. వాస్తును చూడగానే బ్రిటీషు కాలంనాటి యిల్లని తెలిసిపోతోంది. దానికి వంద గజాల దూరంలో రాణీగారి నంటిపెట్టుకున్న పరిచారికల్లా, పెద్ద బిల్డింగుదాపున చిన్నచిన్న పెంకుటింఢ్లయిదారు వున్నాయి.

ముఖం కడుక్కుని, స్కూలులోకి రాగానే ''మారయ్యను కాఫీలు తెమ్మని పంపించినాను సార్!'' అన్నాడు సుబ్బరాజు ఆనందంగా.

''యీ వూళ్లో టీ హోటలుందాండీ'' ఆశ్చర్యపడుతూ ప్రశ్నించాను.

''ముందుకాలంలో భజన మందిరం లేని వూరు వుండేది గాదంట సార్... యీ దినాల్లో గుడి లేకపోయినా ఫర్వాలేదు. టీ బంకుంటే చాలు... యీ వూళ్లో గూడా చిన్న టీ బంకుందంట! అవుతే యీ టయింలో కాఫీ దొరకతాదో లేదోనని మారయ్య డౌటుగా చెప్పినాడు. టీ బంకులో దొరక్కపోతే, వూర్లో యెవరైనా వొక పెద్ద రైతు యింటికయినా పోయి, కాఫీలు తెమ్మని చెప్పినాను...''

అరగంటలో కాఫీలు అందాయి.

కాఫీ తాగేసరికి సుబ్బరాజులో వుత్సాహం పరవళ్లు తొక్కసాగింది. ''మనకు చానా పనుండాది మారయ్యా!'' అంటూ మొదలు పెట్టాడు. ''యీ స్కూల్లో వొక టేబులు, వొక కుర్చీ మాత్రమే వుండాయి. మనకింకా రెండు కుర్చీలూ, రెండు టేబుళ్లూ గావాల. వూర్లో యెవరింట్లో దొరకతాయో చూడు. బూత్‌లు గట్టేదానికి రెండు టేబుళ్లు గావాల. కొయ్యలు నాలుగు జతలు మొత్తం ఎనిమిది సంపాదించు. బూతులు గట్టాల గదా. అందుకు. ఆపైన రెండు దుప్పట్లు తీసుకురా. యేజెంట్లు గూచునేదానికి వొక బెంచీ గావాల. ఇవన్నీ యాడేడ దొరకతాయో విచారించు. టయిం అయిపోతావుంది. యింకొంచేపుబోతే మొబ్బయిపోతాది. యీలోగా మనం లైటరేంజి చేసుకోవాల. వైరూ, బల్బూ దెమ్మని చిదంబరయ్యతో చెప్పినాను...''

సుబ్బరాజుగారి ఫర్మానాతో మారయ్య వూళ్లోకెళ్లిపోయిన పదిహేను నిముషాల తరువాతగానీ చిదంబరయ్య కనిపించలేదు.

''ఇంతసేపూ ఏమైపోయినావు చిదంబరయ్యా! నీ కోసం వెదకమని మారయ్యను గూడా పంపించినాము'' అన్నాడు సుబ్బరాజు.

''మా క్వార్టర్సుకు పోయినాను సార్! మీకు మా స్టేషనేడుందో తెలవదు గదా! యిస్కూలు కెనకపక్క కనిపించే అటోరా బిల్డింగే పోలీస్టేషను. ఆడ్నే మాకు క్వార్టర్సు గూడా వుండాయి. అయితే యీడెవరూ కాపరం లేరు. అందురూ వుండేది పెద వెంకటాపురంలోనే! డ్యూటీకి మాత్రం వచ్చిపోతా వుంటాము. పొద్దన్నుంచీ లారీలో పొర్లాడి చీదరగా వుంటే నా క్వార్టర్సుకు పోయినాను. బోరింగు కాడ్నించీ నీళ్లు పట్టుకోని పోయి స్నానం చేసి బయటపడేసరికి యీ వేళయిపోయింది'' చిదంబరయ్య నేలపైనే చతికిలబడిపోయి బీడీ వెలిగించాడు.

''నేను బల్బు, వైరూ దెమ్మన్న సంగతి మరచిపోయినావా'' సుబ్బరాజు కంగారు పడిపోయాడు.

''యీ వల్లకాట్లో వైరూ బల్బు మీకేడ దొరకతాది సార్!'' గుప్పుమని దూసుకొస్తున్న పొగలోంచి చిదంబరయ్య నవ్వుతున్నాడో లేక సీరియస్‌గానే చెబుతున్నాడో తెలియడం లేదు. ''అయినా యీ స్కూలు మిద్దెలో మీకు సేప్టీ యేముండాది? యీడ్చి తన్నితే తలుపులు పళపళా యిరిగిపోతాయి. బాలెట్టు పేపర్లు బెట్టుకోని యీడ్నే పండుకుంటామంటే నాకేం అభ్యంతరం లేదు. అయితే యెందుకయినా మంచిదని ముందుగానే చెబ్తావుంటాను. యీడ మీకు సేప్టీ లేదు. యెట్లబొయ్యి యెట్లొస్తాదో చెప్పలేము. నా మాట విని మా స్టేషను పోదాం రండి. ఆడగూడ యెవుడూ లేడు. యాడోళ్లాడ యెలక్షను డ్యూటీలపైన దేశం పైకి పోయినారు. వాచ్‌మాను మాత్రం వుంటాడు. రాత్రికి ఆడ్నే పడుకుందాం. రేపు పొద్దున్నే యీడ కొచ్చేద్దాం...!''

''రేపు పొద్దునదాకా మనం స్టేషనులో వుంటే ఈడ బూతులు గట్టేదెవరు? కుర్చీలు టేబుళ్లూ తెచ్చేదెవురు?'' సుబ్బరాజు యింకా కంగారుపడుతూనే వున్నాడు.

''తెల్లారి యెనిమిదగ్గదా పోలింగు... ఆరు గంటలకు స్కూలుకొచ్చేస్తే చాలు. బూతుగట్టే దానికి యెంతసేపు బట్టాది? టేబుళ్లూ కుర్చీలూ మారయ్యతో చెబ్తే రాత్రికి యీడికి జేర్చేస్తాడు...''

యెలక్షను సామాన్ల సంచిని భుజానికెత్తుకుని పోలీసుస్టేషను వైపుకు దారిశాడు చిదంబరయ్య.

నేనూ, సుబ్బరాజు అతడిని అనుసరించసాగాము.

దాదాపు యిరవై అడుగుల పొడవున్న పెంకుటింటికి పోలీసుస్టేషనన్న బోర్డు వేలాడుతోంది.

జవాన్ల క్వార్టర్సు పెంకులు రాలిపోయి, గోడలు కూలిపోయి జీర్ణావస్థలో కనిపించాయి.

చుట్టూ పెరిగిన చింతచెట్లు, కొన్ని దశాబ్దాల పోలీస్టేషను చరిత్రకు సజీవ సాక్ష్యాల్లా నల్లగా చేవబారిపోయి వున్నాయి.

వాచ్‌మాన్ యింటి తలుపు మాత్రం తెరిచివుంది.

చిదంబరయ్య వాచ్‌మాన్ను కేకేసి పిలిచి, స్టేషను తలుపులు తెరిపించాడు.

స్టేషనులోపల పాతకాలపు కుర్చీ వొకటి కనిపించింది. దాని ముందో టేకు టేబుటుంది. వాటిపక్కనున్న చెక్కబీరువాకు తాళం కప్ప వేలాడుతోంది. హాలుకొకవైపున 'సెల్స్' రెండున్నాయి. వాటికున్న యినుప తలుపులు సగం సగం తుప్పుపట్టిపోయి వున్నాయి.

హాలుకు మరోవైపున్న గదిలోంచీ చిత్రవిచిత్రమైన శబ్దాలు వినిపిస్తున్నాయి.

''ఆ రూంలో వైర్‌లెస్ సెట్టుండాది. చానా పాత సెట్టు. కండిషనులోనే వుండాది. అయినా డిస్టర్బెన్స్ యెక్కువగా వుంటాది. క్లారిటీ తక్కువ...'' అంటూ చిదంబరయ్య టేబుల్ పైకెక్కి వాచ్‌మాన్ అందించిన బల్బును హోల్డర్‌కు తగిలించాడు.

సుబ్బరాజు యెలక్షను సామాన్ల మూటను వో మూల భద్రంగా సర్దిపెట్టాడు.

కుర్చీపైన పేరుకున్న దుమ్మును న్యూస్‌పేపరుతో తుడిచేసిన తరువాత వరండాలోకి లాక్కుని కూర్చున్నాన్నేను.

సిగరెట్టు వెలిగించుకుంటూ వుండగా ''నమస్తే సార్!'' అన్న పలకరింపు వినిపించింది.

''నా పేరు దస్తగిరి సార్! పెద్ద వెంకటాపురంలో టీచర్‌గా పనిచేస్తా వుండాను. యీ వూరికి పోలింగ్ ఆఫీసర్‌గా డ్యూటీ వేసినారు నాకు...''

''సుబ్బరాజుగారూ మన పోలింగ్ ఆఫీసరు వచ్చేశారు'' అంటూ కేకేశాను.

అతను స్టేషనులోంచీ వెలుపలికి రాగానే ''యీయన సుబ్బరాజుగారు.. దుర్గవరంలో హైస్కూలు టీచరు. మన యేపీవో... నా పేరు కిరీటి. దుర్గవరం డిగ్రీ కాలేజీలో పాలిటిక్సు లెక్చరరుగా పనిచేస్తున్నాను. నేనే మీ పీవోని...'' అంటూ పరిచయాలు ముగించాను.

పోలీస్టేషను పిట్టగోడమీద కూచుంటూ ''నేను మిమ్మల్ని యేపీవో అనుకున్నాను సార్!. చూసేదానికి యెంగ్‌గా కనిపిస్తారు సార్ మీరు... డిగ్రీ లెక్చరరంటే నమ్మలేకపోతా వుండాను...'' అన్నాడు దస్తగిరి.

''నేను వుద్యోగంలో చేరి యింకా మూడు నెలలయినా పూర్తిగాలేదు సార్! యేపీపీయెస్సీ సెలక్షను... నాది యీ జిల్లా గూడా కాదు. మొదటి పోస్టింగు దుర్గవరమే!'' అన్నాను.

''అయితే యిదే మీ ఫస్టు డ్యూటీ అన్నమాట! వెరీగుడ్! మంచి ప్లేసులోనే పడినారు. చూడబోతే మీ కోసమనే వచ్చినట్టుండాది యీ బై ఎలక్షను...'' దస్తగిరి నవ్వసాగాడు.

''దుర్గవరానికి బైయెలక్షను గారంటీ అని నాకెప్పుడో తెలుసు. రామకోటిరెడ్డికి యెందుకో యీసారి డవుటొచ్చి రెండు ప్లేసుల్లోనించి పోటీజేసినాడు. హైకమాండుకు గూడా ఆయన అవసరం చానావుంది. వోడిపోతే పరువు దక్కదు. అందుకని రెండు చోట్లలో సీటిచ్చినారు. అయినా రాంకోటిరెడ్డి గెలవకపోతే గెలిచేవాడెవుడుండాడు? రెండు సీట్లూ గెలిచేసినాడు. యిప్పుడు వొక సీటుకు రాజీనామా చెయ్యాలగదా! దుర్గవరానికి బైయెలక్షను గారంటీ అని

నాకు ముందుగానే తెలుసు...'' సుబ్బరాజు బీడీ వెలిగించుకోడానికి తన వాగ్ధారను ఆపాడు.

''యీ బైయెలక్షనులో రిజల్టెట్టుంటాదో చెప్పలేము. మొత్తం రాష్ట్రం చూపంతా యీడ్నే వుండాది. రెండు పార్టీలకూ యిది ప్రెస్టేజ్ యిష్యూ అయిపోయింది. కాంపిటీషన్ చాలా టఫ్‌గా వుంది. చూడండి సార్. నేనుండేది పెద్ద వెంకటాపురంలోనే! యీ ఏరియా సంగతి నాకు బాగా తెలుసును. ముందుగానే చెబ్తావుంటాను. మనం చాలా కేరఫుల్‌గా వుండాల...'' అన్నాడు దస్తగిరి.

''సుబ్బరాజుగారూ! నాదో మనవి'' చాలా సేపటినుంచీ చెప్పాలని అనుకుంటున్న విషయాన్ని చెప్పడం మొదలుపెట్టాను. ''యెలక్షను డ్యూటీకి రావడం నాకిదే మొదటిసారి. మీరెన్ని యెలెక్షను డ్యూటీలు అటెండయ్యారో అంత వయస్సు గూడా వుండదు నాకు. నాకెప్పుడెప్పుడేం చేయాలో తెలియదు. పేరుకయితే పీవోని నేనే! అయితే మీరు అన్నిటికి పెద్దదిక్కుగా వుండాలి. సలహాలివ్వడం మీ వంతు, ఫాలోగావడమే నా వంతు...''

బీడీముక్కని నాలుగయిదుసార్లు త్వరత్వరగా ఆవురావురుమని పీల్చిన తరువాత ఆవతలికి గిరవాటు పెడుతూ చిరునవ్వు నవ్వాడు సుబ్బరాజు. ''మీరేమీ భయపడొద్దు సార్! అన్నిటికీ నేనుండాను''

యింతలో గసబోసుకుంటూ స్టేషనుముందుకొచ్చాడు మారయ్య. ''రెండు కుర్చీలూ, వొగ టేబులూ దొరికినాయి సార్. తెచ్చి యిస్కూల్లో బెట్టేసి వస్తా వుండాను. మిగిలినయి కూడా మల్లంక పంపిస్తానన్నాడు మనేగారు...'' అన్నాడు.

మారయ్య మాటలు వినిపించగానే స్టేషను బయటికొచ్చి ''మీల్సు అరేంజి చేసినావా మారయ్యా?'' అని అడిగాడు చిదంబరయ్య.

''ఈ రేత్రికి మనేగారింటి కాడ్నించే తెస్తానుసార్!'' అన్నాడు మారయ్య.

''అయితే యీ రాత్రికి యెన్పీ లేదంటావు. పోనీలే! మీరు గూడా రేపు మద్దానం దాకా పప్పన్నంతో సర్దుకోవాల్సిందే సార్!'' అంటూ చిదంబరయ్య నవ్వసాగాడు.

''నేనింక పెదవెంకటాపురం పోతాను సార్! నాకు సైకిలుండాది. స్కూలుకాడ పెట్టేసి వచ్చినాను. రేప్పొద్దున్నే ఆరుకంతా వచ్చేస్తాను'' దస్తగిరి పైకి లేచాడు.

''వీలయినంత అర్లీగా వచ్చేయండి సార్! లేటు చెయ్యొద్దండి'' సుబ్బరాజు హెచ్చరించాడు.

సరేనంటూ వెళ్లిపోయాడు దస్తగిరి.

తొమ్మిదిగంటలకంతా పెద్ద సత్తు బేసినుతో అన్నం తీసుకొచ్చాడు మారయ్య. అందులోనే చిన్న చిన్న గిన్నెలతో పప్పు, రసమూ, మజ్జిగా వున్నాయి.

భోజనాలు ముగిశాక యెలక్షను సామాన్ల మూటలోంచి బాలట్ పేపర్లను బయటికి తీశాడు సుబ్బరాజు. వాటిని టవలుతో చుట్టి తలకింద దిండులా పెట్టుకున్నాడు. ''మన

జాగ్రత్తలో మనముండాల సార్! యీ రాత్రికి మనం వుషారుగా వుండాల. యెవుర్నిగానీ నమ్మగూడదు. యీ బేలట్ కాగితాలకు యీ రాత్రికాడ్నుంచీ రేపు సాయంత్రం దాకా రూపాయి కాగితాలకంటే యెక్కువ విలువ వుంటాది. ప్రాణం మాదిరి కాపాడుకోవాల. యిదే మీకు మొదటి లెస్సను...'' అన్నాడు.

''మీకేమీ భయమొద్దు సార్! నేను వరండాలోనే పడకేసేసినాను. రాత్రికంతా బల్బు వెలగతానే వుంటాది...'' బయటినుంచే చెప్పాడు చిదంబరయ్య.

స్టేషను తలుపులకు గడియలేసి నేలపైన్నే శాలువా పరుచుకున్నాను.

''వొక సంగతి చెప్పేదానికి మరచిపోయినాను సార్!'' అంటూ లేచి కూర్చున్నాడు సుబ్బరాజు. ''యీ వూర్లో మొత్తం వోట్లు నన్నూటాభైదాకా వుండాయి. మీరు పొద్దున లేస్తానే, పోలింగు మొదలయ్యేదానికి ముందుగా వొక నూరు బాలెట్లు కాగితాలకు వెనకపక్క సైన్ చేసెయ్యాల. లేకపోతే రష్ వచ్చినప్పుడు మనం బిన్నాగా పంపించలేము''

సరేనంటూ పడుకున్నాను.

అయిదు నిమిషాల తరువాత కళ్లు తెరిచి చూశాను.

యెదురుగా నోళ్లు తెరుచుకున్న పులుల్లా 'సెల్స్' కనిపించాయి.

దాదాపు ఆరడుగుల వెడల్పుతో, పదడుగుల పొడవున్న చీకటి గుయ్యారాలు... ఘనీభవించిన కాఠిన్యంలాంటి బండరాళ్లతో కట్టిన గోడలు... నేలపైన గచ్చుగూడా లేదు... అక్కడక్కడా తుప్పుపట్టినా యింకా బలిష్టంగానే వున్న తలుపులు... యెందరు ఖైదీలీ సెల్స్‌లో మాసాల తరబడీ కాలం వెళ్లబోసారో! యెన్ని జీవితాలిక్కడ జీవన్మరణ సమస్యలతో సమసిపోయాయో! యెన్ని దుర్మార్గాలను, దురన్యాయాలను యీ సెల్స్ మౌనంగా భరించాయో! సహించాయో! వీటికే నోళ్లుంటే యెన్నెన్ని బాధలు, గాధలు వినిపిస్తాయో!

భయంతో వెనక్కి తిరిగి పడుకున్నాను. అయినా యెవరివో చూపులు తూపుల్లా వీపుపైన గుచ్చుకుంటున్నట్టుగానే అనిపించసాగింది. యెవరో చెవుల్లో గుసగుసలాడుతున్నట్టుగానే తోచింది. శరీరంలోని వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి.

కళ్లు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించాను.

దూరంగా నిశ్శబ్దాన్ని చీల్చుతోన్న గుంటనక్కల వూళలు...

గాలి వీచినప్పుడల్లా చింతచెట్ల పైన్నుంచీ గబ్బిలాల కేరింతలు...

ప్రొద్దుటినుంచీ, యెండలోబడి ప్రయాణం చేసినందుచేత కలిగిన బడలిక... యెందుకో తెలియని ఆవేదన...

అలా యెంతసేపు గడచిందో తెలియదు.

వున్నట్టుండి పిడుగులు పడినట్టు, భూమి దద్దరిల్లినట్టు యేదో పెద్ద శబ్దం...

వులిక్కిపడి లేచి కూర్చున్నాను.

సుబ్బరాజు నాకంటే ముందుగా లేచి కూర్చున్నట్టున్నాడు.

''యెవరిదో జీపొచ్చింది సార్!'' రహస్యం చెబుతున్నట్టుగా మెల్లగా చెప్పాడు.

రెండు మూడు నిమిషాల తరువాత తలుపులు బాదుతూ చిదంబరయ్య గొంతు - ''డోరు తెరవండి సార్. లైనినస్పెక్టరొచ్చినాడు''

తలుపులు తెరిచాను.

యెదురుగా లైనినస్పెక్టరు కనిపించాడు.

శరీరమంతా మట్టిగొట్టుకపోయి వుంది. బట్టలపైన రకరకాల మరకలు... రేగిన జుట్టు... చేతిలో ఆఫీసు ఫైలు...

''లారీ సుద్దులేటి పల్లెకాడ డొంకలో దిగబడేసింది సార్! యెడుగంటల కాడ్నుంచీ దాన్ని బయటికిలాగడానికి కన్నగసాట్లూ పడినాం. వూళ్లోంచి ట్రాక్టరుతెచ్చి లాగినా అది కదల్లేదు. దుర్గవరానికి ఫోన్ జెయ్యాల. యిక్కడ వైర్‌లేస్ వుందంట గదా!...'' మాట్లాడుతూనే గదిలోకి వెళ్లాడు లైనినస్పెక్టరు.

చిదంబరయ్య అతడి వెనకాలే లోనికెళ్లాడు.

వైర్‌లేస్ సెట్టు మిమిక్రీ మొదలుపెట్టింది.

లైన్ యినస్పెక్టరు వైర్‌లేస్‌లో గొంతు చించుకోసాగాడు.

''నేను పడుకొంటాను సార్! లైనినస్పెక్టరు వెళ్లిపోయినాక తలుపులు గట్టిగా వేసుకుని పడుకోండి...'' అంటూ సుబ్బరాజు మళ్లీ నిద్రకుపక్రమించాడు.

పదిహేను నిముషాల తరువాత లైనినస్పెక్టరూ, చిదంబరయ్యా గది బయటి కొచ్చారు.

లైనినస్పెక్టరు కుర్చీలో కూలబడ్డాడు.

''పొద్దన్నుంచీ అన్నం తినలేదంటా వుండారుగదా! యీ బేసిన్లో కొంచెం అన్నం వుండాది. కొంచెం పప్పుకూడా వుండాది. తినండి సార్'' అన్నాడు చిదంబరయ్య.

''యిప్పుడేమీ ఆకలిగా లేదుగానీ నీళ్లుంటే తెచ్చిపెట్టు'' అన్నాడు లైనినస్పెక్టరు.

చిదంబరయ్య చెంబుతో నీళ్లు తెచ్చి యిచ్చాడు.

పెద్ద చెంబునీళ్లతో కడుపునింపుకున్న తరువాత సిగరెట్టు వెలిగించుకున్నాడు అతను.

రెండు దమ్ములు లాగి, కళ్లు మూసుకుని అలాగే సోలిపోయాడు.

రెండు నిముషాలలాగే వుండిపోయాడు.

అంతలోనే వులిక్కిపడి లేచి నిల్చున్నాడు.

వెనుదిరిగి భారంగా అడుగులు సాగించాడు.

తరువాత కొంతసేపటికే లైనినస్పెక్టరు జీపు తుర్రుమంటూ స్టార్టయింది.

''యీ పొద్దు వసన లైనినస్పెక్టరుకు తిరణాలే సార్!'' తలుపు సందులోనుంచి

తొంగిచూస్తూ నవ్వసాగాడు చిదంబరయ్య. ''లారీ డొంకలో యిరుక్కొని పోయిందంట! యింకో లారీని అంపించమంటే డియెస్పీకి వుగ్రమొచ్చేసింది. యేడు గంటలన్నుంచీ యిప్పటిదాకా లారీకాడ తనకలాడి యీ వూరికొచ్చినాడు. యిప్పుడేమో డియెస్పీ దగ్గర అక్షింతలేసుకోనిమల్లా లారీకాడికి పోతావుండాడు. లారీల్లో వుండే పీవోలనూ, ఏపీవోలనూ జీపెక్కించి తావు జేర్పించమని ఆర్డరు.'లారీకాడ గోరీ దగ్గర గుంటనక్క కూచున్నట్టుగా తెల్లారేదాకా కాపలా గాయుమని లైనినస్పెక్టరు జాతకంలో రాసిపెట్టి వుండాది...'' చిదంబరయ్య లోపలికొచ్చి అగ్గిపెట్టె తీసుకుని బీడీ వెలిగించుకున్నాడు.

''అర్ధరాత్రయిపోయిందిసార్! యింకమీరుగూడా పడుకోండి. తెల్లారి అయ్యాగాకముందే జాతర మొదలయిపోతాది'' అంటూ బయటికెళ్లిపోయాడు.

లేచి తలుపులు వేసుకున్నాను.

పడుకున్నానే గానీ చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు.

నాకిప్పుడు సెల్స్‌లో చిత్రహింసలకు గురయిన ఖైదీలు గుర్తురావడం మానేశారు.

లైన్ యినస్పెక్టరు ఆకారమే మాటిమాటికి జ్ఞప్తికి రావడం మొదలెట్టింది.

## 3

తెల్లవారు జామునెప్పుడో గాఢనిద్ర పట్టినట్టుంది.

లేచి కూర్చున్న చాలాసేపటిదాకా, నేనెక్కడున్నానో నాకు స్ఫురించలేదు.

అటూ యిటూ దొర్లించి, కుదుపుతూ నిద్రలేపిన సుబ్బరాజు యెదురుగా కనిపించాడు.

''బాగా తెల్లారిపోయింది సార్! టయిం అయిదున్నరయిపోయింది. మీరు అర్ధగంటలో స్నానం చేసుకొని రెడీ అయిపోవాల. మారయ్య పొంతనిండుకూ నీళ్లు కాచేసినాడు. నేను స్నానం చేసేసినాను. మీరు బిన్నా తెమలండి...'' అంటూ సుప్రభాతం పాడాడు.

కాలకృత్యాలు ముగించుకున్న తరువాత స్నానం చేసేశాను.

బాలట్ పేపర్లను భద్రంగా చేతబట్టుకుని ''మారయ్యతో మూటను స్కూల్లోకి చేర్చేయమని చెప్పినాను. మనంగూడా వెల్దాం పదండి'' అన్నాడు సుబ్బరాజు.

స్కూలు బిల్డింగులోకి వెళ్లిన తరువాత, రిస్ట్‌వాచీ కేసి చూశాను.

సమయం ఆరున్నరయింది.

సుబ్బరాజు స్కూలులోని దేశపటాన్ని తీసి చుట్టి పెట్టేశాడు. తొలి ప్రధాని ఫోటోను తిప్పి తగిలించేశాడు. ఆ తరువాత మూటలోంచీ పోలింగుస్టేషను ప్లాను పైకి లాగాడు. మారయ్య సహాయంతో కుర్చీలూ, టేబుళ్లూ సర్దేశాడు.

వీధిలోంచీ లోనికడుగుపెడుతూనే యెడమవైపున పోలింగు ఆఫీసరు కుర్చీ, దాని పక్కన యేపీవో సీటు, మూలలో పోలింగు బూతుకోసం టేబులు... వీధి గుమ్మానికి కుడివైపున పీవో కుర్చీ... పీవో కుర్చీకెదురుగా యేజెంట్లు కూచోవడం కోసం చెక్కబెంచీ... యిదీ

యేర్పాటు...

''నా కుర్చీని మరికొంచెం అటువైపునకు లాక్కుంటానండీ! కిటికీ దగ్గర కూచోడం నాకు అలవాటు'' అన్నాను.

మారయ్యతో చెప్పి నా కుర్చీని కుడివైపుకు జరిపించాడు అతను. ''మీ టేబులుపైన, అంటే మీకు యెదురుగుండా బాలెట్ బాక్సు పెడతాను సార్. కాబట్టి మీరు కిటికీకి కొంచెం దూరంగా వుంటేనే మేలు. అందువల్ల మీ సీటును యింకా కుడిపక్కకు జరిపితే బాగుండదు'' అంటూ తేల్చిపారేవాడు.

సీటులో కూర్చున్నాను.

కిటికీలోంచీ బోరింగు నీళ్లను మోసుకెళ్తున్న గృహిణులు కనిపిస్తున్నారు. దాదాపు అయిదేళ్ల వయసున్న అమ్మాయొకతె తల్లితో బాటూ చిన్నచెంబుతో నీళ్లు తీసుకుపోతోంది. బక్కచిక్కిన దున్నపోతులు రెండు 'స్లోవాకింగ్ రేస్'లో పాల్గొంటు న్నట్టుగా కాళ్లీడ్చుకుంటూ వెళ్తున్నాయి. యెదురింటి వరండాలోని నులకమంచం పైన కూర్చున్న ముసలివాడు మావైపే పరకాయించి చూస్తున్నాడు.

బాలట్ పేపర్లను నా ముందుంచాడు సుబ్బరాజు. ''మీ దగ్గర నూరు బాలట్ పేపర్లు యిస్తావుండాను సార్. ముందు మీరు వీటి వెనకాల సిగ్నేచర్ చేసేయండి. నేనీలోగా యీ దుప్పటితో బూత్ కట్టేస్తాను'' అన్నాడు.

బాలట్ పేపరు దాదాపుగా వొక అడుగు పొడవుంది. మొత్తం యేడు పేర్లున్నాయి అందులో. ప్రతి యాభై బేలట్లనూ వొక పుస్తకంలా తయారు చేశారు.

మొదటి పుస్తకంపైన సంతకాలు పూర్తవుతూ వుండగా దస్తగిరి లోనికొచ్చాడు.

''గుడ్‌మార్నింగ్‌సార్! మీరు అప్పుడే పనిలోకి దిగేసినట్టుండారు. దార్లో సైకిలుకు పంచరయింది. సైకిలు తోసుకొని వచ్చినాను. అందుకే కొంచెం లేటయ్యింది...'' అంటూ బెంచీపైన కూర్చున్నాడు.

''అయిన లేటు అవనే అయ్యింది. యికనయినా మీరు చకచకగా పనిలోకి దిగెయ్యాల. లేకుంటే పోలింగు టయానికి బిగిన్ జెయ్యలేము. మీరు ఆ మూట్లోని కవర్లూ, ప్రిస్క్రయిబ్డ్ ఫారాలూ సార్టవుట్ చెయ్యండి. అదీ మీ పని'' వెదురుకొయ్యకు దుప్పటిని బిగిస్తూనే సుబ్బరాజు ఫర్మానా జారీచేశాడు.

''యేడేగద సార్ టయిం? అప్పుడే యేం తొందర? యెనిమిదిగ్గదా పోలింగు. ముందు మీరు కాఫీలు తాగినారా లేదా చెప్పండి. టిఫిను సంగతేం చేసినారు?'' అని అడిగాడు దస్తగిరి.

''ఆ సంగతి చిదంబరయ్యకే తెలియాలి'' అన్నాన్నేను.

దస్తగిరి మారయ్యను కేకేసి, రెండు రూపాయల నోటు అతడి చేతికిచ్చి కాఫీలు తీసుకు రమ్మన్నాడు.

''దార్లో యెవరినయినా అడిగి యేజెంట్లు యెవ్వరో తెలుసుకో వూరయ్యా! యేజెంట్లను బిన్నారమ్మని చెప్పు. పేపరు సీలుపైన యేజెంటు సంతకం చేయించుకుంటే బాలట్ బాక్సును సీల్‌చేసి పెట్టెయ్యొచ్చు. యెనిమిదికంతా ఆ పనయిపోవాల...'' అన్నాడు సుబ్బరాజు.

గోనె సంచీ తెరచి, కవర్లూ, కాగితాలూ ముందేసుకుని కూర్చున్నాడు దస్తగిరి.

'బూత్' పని ముగిసిన వెంటనే బాలట్ బాక్సును పైకిలాగాడు సుబ్బరాజు.

''కేర్‌ఫుల్‌గా వుండండి సార్! మొన్న యెలక్షను క్లాసులప్పుడు ట్రయిల్ జూడబోతే, మా కొలీగ్‌కు చెయ్యి చురుక్కుమనింది. బాలట్ బాక్సు తెరిచి చూస్తే, తేలు కనిపించింది. లోపలేముందో చూడకుండా హోల్‌లో వేలు పెట్టొద్దండి'' అన్నాడు దస్తగిరి.

బాలట్ బాక్సును టేబులుపైన పెట్టుకుని, తన సీట్లో కూర్చున్నాడు సుబ్బరాజు. ''ఆ కాడికి మీ కొలీగే లక్కీఫెలో సార్ ! మా ఫ్రెండొకాయనకు లాక్ లాగేటప్పుడు చెయ్యి కోసుకపోయింది. అది సెప్టిక్కయి నానా అగసాట్లూ పడాల్సొచ్చింది'' అంటూ బాక్సును పరీక్షించసాగాడు.

''ఈ బాలట్ పేపర్లు పెద్దవిగా వున్నాయి. యింకో రెండు బాలట్ బాక్సులను గూడా రెడీగా పెట్టుకోవాలి మనం'' అన్నాను.

''నిజానికి ఫీల్డులో వుండేది యిద్దరే! మిగిలినోళ్లు యిండిపెండెంట్లు. వీళ్లల్లో యెందరు నిజంగా ఫీల్డులో వుండారో, యెందరు విత్‌డ్రా జేసుకున్నారో తెలవదు. అసలు వీళ్లకు గెలవమని తెలుసు. అయినా బాలెట్ పేపరులో పేరు చూసుకుందామని కొందరికి మునాశ! దీన్ని సరిగ్గా మడిచేదానికి మనం పడే బాధ యెవుడికి గావాల?'' దస్తగిరి విసుక్కున్నాడు.

''యేజెంట్లొచ్చే లోపల మనం యీ పని చేసేద్దాం సార్!'' అంటూ తన కుర్చీని నా ముందుకు లాక్కున్నాడు సుబ్బరాజు. దస్తగిరి సర్దిపెట్టిన కవర్లనూ, కాగితాలనూ తీసుకుని నా ముందుంచాడు.

టెండర్డు వోట్లు, చాలెంజి వోట్లు, గుడ్డివాళ్ల వోట్ల లెక్క, బాలట్ పేపర్ల అకౌంటు మొదలయిన వాటిని వుంచేందుకు రకరకాల సైజులున్న కవర్లు యేడెనిమిది వున్నాయి. సుబ్బరాజు కొన్ని ఫారాల్లో 'నిల్' అంటూ వో మాట రాసేసి, అకౌంటు కాలంలో పెద్ద నిలువుగీత గీసి పారేయసాగడు.

''ఆగండాగండి సార్. మీరు చేస్తున్న పనేమిటి?'' కవర్లూ కాగితాలూ దూరంగా లాగేస్తూ కంగారుపడిపోయాను నేను. ''ఏమిటిలా వీటిపైన నిల్లని రాసేస్తున్నారు? అసలు టెండర్డు వోట్లు, చాలెంజ్ వోట్లు అంటే యేమిటో గుర్తుందా మీకు?''

తలపైకెత్తి ముసిముసినవ్వులు నవ్వుతూ ''యేందో మీరే చెప్పండి సార్...'' అన్నాడు సుబ్బరాజు.

''యెవరైనా వొక వోటరొచ్చి తన పేరు చెప్పి వోటు అడగతాడనుకోండి! అప్పటికే ఆ

పేరుతో మరొకరు వోటేసేసి వుంటారనుకోండి. అప్పుడా వ్యక్తిని వోటు వేయనివ్వాలా లేదా అనే సమస్య పుడుతుంది. అప్పుడతనికి టెండర్డు బాలెట్ పేపరివ్వాలి. మన దగ్గరున్న వోట్ల పుస్తకంలోంచి చివరి వోటు తీసి, టెండర్డు వోటని నోట్‌చేసి ఇవ్వాలి. అలాంటి వోట్లని ప్రత్యేకమైన కవరులో సీల్‌చెయ్యాలి. యేజెంటు వోటరు తన పేరు తప్పుగా చెబుతున్నాడని వాదనకు దిగినప్పుడు చాలెంజ్ వోటు అవసరం వస్తుంది. చాలెంజ్ చేస్తున్న వ్యక్తుల దగ్గర డిపాజిట్టు కట్టించుకోవాలి. తప్పుచెప్పిన వాళ్ల ఫైన్ కట్టాల్సి వస్తుందని హెచ్చరించాలి. తరువాత యెన్‌క్వయిరీ జరపాలి. చాలెంజ్ వోట్ల లిస్టును ప్రత్యేకమైన కవర్లలో సీల్ చెయ్యాలి. గుడ్డివాళ్లు వోటు చేయలేరు గదా! వాళ్లకో వ్యక్తి సహాయం అవసరం. సహాయకుల దగ్గరినుంచీ హామీపత్రంలో సంతకం చేయించుకోవాలి. ఆ లిస్టును కూడా ప్రత్యేకమైన కవర్లో సీల్ చెయ్యాలి. పోలింగు పూర్తయితేగానీ ఆ లిస్టుల్ని తయారు చేయడం కుదరదు. మీరు పోలింగు ప్రారంభం గాకమునుపే ఫారాల్ని నింపేస్తానంటున్నారు. అదెలా సాధ్యపడుతుంది చెప్పండి?'' అని అడిగాను.

''మనకుండే ననన్నూటాభై వోట్లలో యివన్నీ యెందుకు సార్! యేమీ రాలేదని రాసిపారేస్తే పోతుంది. లాస్టులో టాలీ చేసేది సులభంగా వుంటాది. యీ అకౌంటంతా రాసిపెట్టే బాధ తప్పుతాది. వొకవేళ అట్లాంటి వోట్లు పడే అవసరంగాని వొస్తే మెల్లగా వాళ్లతో రాజీ చేసుకుని, రానీయకుండా చూసే పూచీ నాది. ఇంక గుడ్డోళ్లకు గైడుగా మన యేజెంటునే వుండమందాం. యీమాదిరి అయిన్దానికి, కానిదానికీ అకౌంటు చూపించాలంటే యెవుడివల్ల అవుతాది సార్! అందుకే తెలివిగా యీ మాదిరి వోట్లు రానీకుండా చూసుకుందాం. అప్పుడు యీ ఫారాల్ని రాసుకుంటా కూర్చునే బాధ తప్పుతాది. అసలు ప్రతి యెలక్షనులోనూ మేము యీ మాదిరే చేస్తా వుండాము. వొక్కోసారి ముందుగానే కవర్లకు సీలుగూడా చేసేస్తావుండే వాళ్లం. కావాలంటే దస్తగిరి సార్‌ను అడగండి. యిదంతా మీకు కొత్తగా వుందేమో!'' కవర్లలోకి ఫారాల్ని తోసేస్తూ సుబ్బరాజు వుపదేశం గావించాడు.

''అవునుసార్! యీ తలకాయ నొప్పి పనులంతా మనకేల? యీ మునన్నూటారో లోకంలో యే గొడవా రాకుండా ఎలక్షన్లు జరిపించేదానికే తల ప్రాణం తోకకొస్తాది. యింక యీ లెక్కలన్నీ యేసేదానికి మనమేమయినా చిత్రగుప్తుడికి సాయానా తమ్ముళ్లమా యేమయినానా? మీరేమీ డౌటు పడద్దుసార్! యెప్పుడూ యిట్లే మేము ఫాలో అయ్యేది. యీ పనులన్నీ ముందుగా చేసేసుకుంటే పోలింగు అయిపోయినాక గబగబా బాలట్ పేపర్ల అకౌంటు టాలీ చేసుకోని, అన్ని కవర్లకూ సీలు చేసెయొచ్చు'' అన్నాడు దస్తగిరి.

యెంతగా సరిపెట్టుకున్నా నాకెందుకో చేస్తున్న పని మంచిదిగా తోచలేదు. సందిగ్ధావస్థలో నేను కొట్టుమిట్టాడుతూ వుండగానే మారయ్య కాఫీలు పట్టుకొచ్చాడు.

''యేజెంట్లు రాలేదా మారయ్యా?'' అని అడిగాడు సుబ్బరాజు.

''యెనకాల్నే వస్తాను పొమ్మని నాడు సార్...'' అన్నాడు మారయ్య.

''నాష్టా తినకుండానే కాఫీలు తాగతావుండారా సార్!'' పరామర్శిస్తూ లోపలికొచ్చాడు

చిదంబరయ్య.

''దస్తగిరి సార్ వచ్చి లెక్కిచ్చి పంపించేదాకా యివయినా వస్తాయనే ఆశ లేకుండా పోయింది. నిన్ను నమ్ముకుంటే మేము శోషొచ్చి పడిపోయేటట్టుండాది'' నిష్టూర పడిపోయాడు సుబ్బరాజు.

''అయ్యయ్యో! నన్నంటారేంది సార్ మీరు?'' మారయ్య వైపుకు తిరిగాడు చిదంబరయ్య. ''మనేగారింటికి పోయి, నాష్టా తెచ్చి పెట్టమని చెప్పలేదా మారయ్యా నీకు...''

''నాష్టా రాజకుమార్రెడ్డి యింటికాడ్నుంచీ వస్తాదనుకోని వాళ్లు చేయలేదంట సార్'' అన్నాడు మారయ్య.

చిదంబరయ్య మౌనంగా వుండిపోయాడు.

సరిగ్గా అప్పుడే అయిదున్నరడుగుల పొడవున్న ఆగంతకుడొకడు స్కూలులోకి అడుగు పెట్టాడు. బాగా పలచబారిపోయిన వెంట్రుకల్లో నల్ల వెంట్రుకల్ని లెక్కపెట్టుకోవచ్చు. లోతుకుపోయిన కళ్లు. పైకి పొడుచుకొచ్చిన ముక్కు. కత్తెరకు నోచుకోని మీసకట్టు... నిరంతర ధూమపానాన్ని చాటిచెప్పే లోతు బుగ్గలు... పుల్లగా మారిపోయిన చొక్కా... దాదాపు అదే రంగులో వున్న పంచ... పైన టర్కీ టవలు... అతడి వయస్సు యాభైకి పైన్నే వుంటుంది.

జేబులోంచీ రెండు కాగితాలు తీసి నాచేతికిచ్చాడతను. కోలా సుధాకర్రెడ్డి అనే అభ్యర్థి తాలూకు యేజెంటుగా నియామకపు ఆర్డరు అది. యేజెంటు పేరేమిటో అందులో యింకా రాయలేదు.

''మీరేనా యేజెంటు?'' అని అడిగాను.

పొగచూరిన పెదవుల్ని సాగదీశాడు అతను.

''యిందులో ఎవరిపేరూ రాయలేదే?''

''రాయకుంటే రాసుకోండి...''

''యేమని రాసుకునేది?''

''బొంతల చిన్నపీరారెడ్డి... అదే నా పేరు..'' బెంచీపైన కూర్చున్నాడతను. ప్రొఫార్మాలో అతడి పేరు రాసుకున్నాను.

''యీ ఊళ్లో యేజెంటు మీరొకరేనా? యింకా యెవ్వరైనా వుండారా?'' అని అడిగాడు సుబ్బరాజు.

''నేను కోలా సుధాకర్రెడ్డికి యేజెంటు... దినెమగుంట వెంకటసుబ్బారెడ్డి యేజెంటు యెవురో నాకు తెలవదు'' అన్నాడు అతను.

''బాలట్ బాక్సుకు పేపరు సీలు వెయ్యాల.... మిగిలిన యేజెంట్లు గూడా వచ్చేస్తే సైన్ చెయ్యించుకోవచ్చు. టయిం ఎనిమిదయిపోతావుంది...'' సుబ్బరాజు కంగారుపడటం

మొదలుపెట్టాడు.

''యీ యేజెంటు సైన్ తీసుకోని బాక్సుకి సీలెయ్యండి సార్! యేజెంట్లు రాకపోతే తప్పు మనదిగాదు. యెవుడైనా అడిగితే, యేడూ యాభైదాకా వెయిట్ చేసినామని చెప్పొచ్చు. యీ యేజెంటు సిగ్నేచరు తీసుకోండి మీరు. అదే సాలు!'' అనేశాడు దస్తగిరి.

పేపరు సీల్ వెనుకవైపున బొంతల చిన్న పీరారెడ్డి వొంకరి టింకరి అక్షరాలతో సంతకం చేసేశాడు. బాలట్ బాక్సు ఖాళీగానే వుందన్న సంగతి యేజెంటుకు నిరూపించి చూపించిన తరువాత సుబ్బరాజు బాక్సుకు సీల్ వేయడం మొదలు పెట్టాడు.

గోనెసంచీలోంచి వోటర్ల జాబితా పైకి తీసుకుని, నా చేతికొక కాపీనందించాడు దస్తగిరి. యిండికేషను మార్కుకోసం యింకుబాటిలు తీసి తన టేబులుపైన వుంచుకున్నాడు.

సీలు చేసిన బాక్సును నా టేబులుపైన వుంచేశాడు సుబ్బరాజు. ''బాక్సు మీ దగ్గిర పెట్టేసినాను సార్! యింక దీనిపైన వొక కన్నేసుకుని చూసుకునే పని మీదే! సాయంత్రం దాకా కుర్చీలోనుంచి పైకి లేవద్దండి. చూడు పీరారెడ్డి - నీ సీటు ఆ బెంచీ పైన్నే. వోటరు లోపలికి రాగానే దస్తగిరి సార్ దగ్గరికొస్తాడు. ఆయన పేరు చూసి, వోటర్ల లిస్టులో నెంబరు రవుండు చేసుకొని, యెడమచేతి వేలికి యింకుమార్కు పెడ్తాడు. నా దగ్గరికొస్తే వోటు చించి, సిగ్నేచరు తీసుకొని, మడిచి యిచ్చేస్తాను. వోటు బూతులోకి పోయి వెయ్యాల. యింక్‌పేడూ, ముద్రా లోపలే బెట్టేసినాను. బూతులో నుంచీ బయటికొచ్చి, బాక్సులో వోటేసేసి, యెనకపక్క దోవగుండా బయటికెళ్లిపోతారు. వోటరు, యేజెంటు దగ్గర యింకో వోటర్ల లిస్టు యిచ్చేస్తాను. పోలయిన వోట్లును గుర్తుపెట్టుకో చిన్న పీరారెడ్డి! అదీ ప్రొసీజరు. యేమంటావు? అంతా సరిపోయిందా, లేదా? యిప్పుడే జెప్పేయి. తరువాత కంప్లయింట్ జేసి లాభం లేదు...''

''అంతా వోర్రెడీగా వుండాది సార్!'' అన్న బొంతల చిన్న పీరారెడ్డి సర్టిఫికెట్టు అందుకున్న వెంటనే ''యిప్పుడు సరిగ్గా యెనిమిదవతావుంది. అంటే పోలింగ్ మొదలయిపోయిందని అర్థం'' అంటూ ప్రకటించేశాడు సుబ్బరాజు.

నేనూ వాచీకేసి చూసుకుని ''యిక ప్రారంభిద్దాం! చిన్న పీలారెడ్డిగారూ, మొదటి వోటు మీరే వెయ్యండి'' అన్నాను.

''నేనా... యిహిహీ... యిప్పుడేనా?'' అంత వయస్సున్న వ్యక్తి సిగ్గుపడటం చూడటానికి తమాషాగా వుంది.

''సుబ్బరాజుగారూ! మన యేజెంటుకు మొదటి వోటు చింపియ్యండి...'' అన్నాను.

''వొద్దు... వొద్దొద్దు... మీరుండండి సార్!'' అతడీసారి కంగారుపడిపోయాడు. ''నేను లాస్ట్‌లో యేస్తాను... మొదట్లో వోటేసే వాడిక నాకు లేదు...'' అంటూ అతడు వారించాడు.

నాకతడి ధోరణి చిత్రంగా తోచింది.

మొదటి వోటు వేయడానికి వాడుకంటూ వొకటుండాలా?

చిన్న పీరారెడ్డివైపు బిక్కచూపుల్ని సారించాను.

అతడింకా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూనే వున్నాడు.

పది నిమిషాలు గడిచాయి.

యిండికేషను వర్కుచేయడం కోసం దస్తగిరి వెదురు పుల్లను తయారు చేసుకుంటున్నాడు.

వోటు పుస్తకంపైన ఇనపరేకు అదిమి పెట్టుకుని, మొదటి వోటును చింపే మహదవకాశం కోసం సుబ్బరాజు ఎదురుచూస్తున్నాడు.

''సాధారణంగా టౌన్లోనయితే యెనిమిదికంతా వోటర్లు క్యూల్లో నిలబడుకొని వెయిట్ చేస్తూ వుంటారు. యిక్కడ యింకా మనుషుల పొలకువే కనిపించడం లేదేమిటి?'' అంటూ విస్తుపోయాను.

''పనుల కాలం కదా సార్! పదికంతా యెండమండిపోతాది. అందుకని తెల్లారు జామున్నే పత్తి తోట్లకు ఎల్లిపోతారు జనం. పదిగంటలపైన్నే యింటికొస్తారు. వొచ్చి సద్దన్నం తిని, సల్లంగా వోటేసేదానికొస్తారు. అదీ యీ వూర్లో వాడిక...'' అన్నాడు చిన్న పీరారెడ్డి.

''యీ వూర్లో మామూలుగా వోట్లు బాగా పోలవుతాయా?'' వోటరెవ్వరూ రాకపోవడంతో సుబ్బరాజు కబుర్లు మొదలుపెట్టాడు.

''యీ పక్క యిలాకాకంతా మా వూరు పేరు మోసిన వూరు...'' అతను మరోసారి మీసాల చాటును ముసిముసి నవ్వుల్ని కొనసాగించాడు. ''యీ మూడుచింతలపల్లెలో వుండే యాభై గడపలకూ, సీమబాగిపాడులో వుండే యాభై గడపలకూ యిదే పోలింగు సెంటరు. యీ రెండూళ్లకూ వుండే వొద్దిక అంతా యింతా అని గాదు. అంతా వొక తాటిపైన్నే నడస్తాం. వోట్లప్పుడు గూడా అంతే! యెప్పుడూ నూటికి నూరు వోట్లు పెట్టెలో పడాల్సిందే! వొచ్చే ఆఫీసర్లకు యిది వైకుంఠం మాదిరి. గొమ్ముని కూసోనుంటే, అంతా మేమే జేసేసుకుంటాం! అదీ మా వూరంటే...''

''అంటే యిక్కడికి సీమబాగిపాడు నుంచీగూడా వోటర్లొస్తారన్నమాట! అదిగూడా యిట్లాగే బీదాబిక్కీ వుండే వూరా? కొంచెం మారాజులు గూడా వుంటారా?'' వాకబు చేయసాగాడు సుబ్బరాజు.

''ఛ... ఛ... ఆ వూరెక్కడ? యిదెక్కడ? యీడినుంచి తూరుపుగా అరమైలు దూరంలో వుండాదా వూరు. అక్కడికి ఫర్లాంగులో కెనాలొస్తాది. ఆడ్నే రాజకుమా(రెడ్డుండేది. రాజకుమా(రెడ్డంటే ఎవురో తెలవదా మీకు? యీ జిల్లాలోనే పెద్ద సెయ్యి! పెద్ద రెడ్డోళ్ల మహిడి అంటే యెట్టుంటాది? సినిమాల్లో చూసే యిండ్లు మాదిరుంటాది. యింటినిండా రూములే! బాత్రూంలే అయిదారుండాయి. యింటి మిద్దెపైన నీళ్ల ట్యాంకు రూంరూంకూ కొళాయిలు... కొళాయి తిప్పితే యిరవై

నాలుగ్గంటలూ నీళ్లు వస్తాయి. హాల్లో వుండే సోఫాసెట్టు బెంగుళూరునించీ తెప్పిచ్చినారు. యింటి ముందర కారో, మోటారుబైక్కో, ట్రాక్టరో- యేదో ఒకటి డబడబమని అరస్తానే వుంటాది. రాజకుమార్రెడ్డి యింటికి పక్కనే వాళ్ల తమ్ముడు శివకుమార్రెడ్డి ఇల్లుండాది. అది గూడా పెద్దిల్లే! అవుతే శివకుమార్రెడ్డి యీ వూర్లో వుంటేగదా! యెప్పుడూ మద్రాసో, బెంగుళూరో - వొక దినం వుంటే మల్లింక నెలదినాలు వుండడు. యీ సంగతులన్నీ నాకెట్ల దెలుసునని అడగతారేమో! యిల్లయితే యీ వూళ్లో వుండాదిగాని, మనం పొద్దుగూకులూ ఆడ్నేగదా వుంటాం! వొకవేళ మనం వొగదినం పొలుమారినామే అనుకోండి. పెద్దరెడ్డింటి కాడ్నుంచి మనిషే వచ్చేస్తాడు... తూర్పు పక్క చేన్లో పత్తి వొలిపించాలన్నా, ముూడుచింతలపల్లినుంచీ కూలోళ్లని పిలుచుకుని రావాలన్నా; పెదెంకటాపురంలో యేమయినా బజారు పన్లున్నా అన్నిటికీ యెక్కడరా చిన్న పీరారెడ్డి- అంటాడు రాజకుమార్రెడ్డి'' చిన్నపీరారెడ్డి మీసాల్ని దువ్వుకుంటూ సిగరెట్టు వెలిగించాడు.

''అసలు యీ బైయెలక్షన్లో సీటు రాజకుమార్రెడ్డికే వస్తాదని రూమరునింది...'' అన్నాడు దస్తగిరి.

''రూమరేంది? అసలు సీటువచ్చేసిందనే అనుకుంటిమి. రాజకుమార్రెడ్డి హైద్రాబాదుకు కూడా పొయ్యేసి వచ్చినాడు. ఆడేం జరిగిందో యేమో- వున్నట్టుండి కోలా సుధాకర్రెడ్డి పేరు పేపర్లో వచ్చేసింది. రాజకుమార్రెడ్డి వాళ్ల నాయిన వరదరాజులురెడ్డి అప్పట్లోనే జిల్లా బోర్డుద్దు వైసు చేరుమన్నుగా వున్నాడు. ఆయన కొడుకులు గూడా యెక్కడ పైకొచ్చేస్తారో అని అందరికీ అక్కసు. అయినా సీటే నిజంగా గావాలనుకుంటే రాజకుమార్రెడ్డికి అదొక లెక్కా? ఎంపీ సీటే తెచ్చుకునే పవరుంది. యెందుకో పెద్దరెడ్డి సూపు ఆ పక్కకు పోలా...''

''రాజకుమార్రెడ్డికి ఎంత వయసుంటుంది? అరవై వుంటాదా'' సుబ్బరాజుకు సందేహాలపైన సందేహాలు పుడుతున్నాయి.

''అరవయ్యా? యాడుంటాది? నాకంటే అయిదారేండ్లు చిన్నోడు... నేను రాజమండ్రికి పోయినప్పటికి ఆయనకు పెండ్లి గూడా గాలేదు...''

''రాజమండ్రికా? అక్కడేం ఉద్యోగం జేసినావు?'' యీసారి దస్తగిరి ప్రశ్నించాడు.

''వుద్యోగమా! మనకా?...'' చిన్న పీరారెడ్డి మీసాల్ని మెలివేశాడు... ''వొకడి దగ్గర తలొంచే వుద్యోగం మనంజేస్తామా? మనం పొయ్యింది వుద్యోగానికి గాదు... జైలుకు...''.

వులిక్కిపడ్డాన్నేను... పొరబాటున విన్నానేమోనని ''యెక్కడికి?'' అంటూ ప్రశ్నించాను.

''జైలుకు సార్! వొక్క సమత్సరమా? పదేండ్లు... వెయ్యిన్నీ తొమ్మనూటయాభైనుంచీ అర్వైదాకా మనం వునింది రాజమండ్రిలోనే...''

''యెందుకు జైల్లో యేసినారు నిన్ను?'' దస్తగిరి భయపడుతూనే ప్రశ్నించాడు.

''ఖూనీ కేసు... యీడ్నే... రెండుచింతలపల్లెలో మునార్గాడ్ని ఖూనీ చేసిన కేసు...

మునార్‌గాడి పేరిన్లేదా మీరు? పెద్ద పయిల్వాను మాదిరిగా వుండేవాడు. పెద్దరెడ్డోళ్ల నాయన - అంటే వరదరాజులురెడ్డిపైన కయ్యిమని లేచినాడు. అంతే! వారం దినాలయినా గాకుండా గోరీల్లో పండుకున్నాడు... పెద్దరెడ్ల మాటంటే అంతే! అప్పుడే మనం జైలుకు పొయ్యింది...''

ఖూనీ కేసును గురించిన మరిన్ని వివరాలు అడిగి తెలుసుకునే సాహసం మాలో యెవరికీ వున్నట్టు లేదు. అందరూ మౌనంగా వుండిపోయాము.

స్కూలు బయట అప్పటికే యెండ సెగలు గ్రక్కడం ప్రారంభించింది.

రచ్చబండపైన, చింతచెట్టు నీడలో బైరాగిలా కాళ్లు చాపుకుని బీడీ కాల్చుకుంటున్నాడు చిదంబరయ్య.

యెదురింటి వరండాలోని ముసలివాడు కుక్కిమంచంలో కునికిపాట్లు పడుతున్నాడు.

మారయ్య యెండలోనే స్కూలు ముందు పచార్లు చేస్తున్నాడు.

''మారయ్యా! ఆఫీసర్లకు కాఫీలు తీసుకురా పో!'' అంటూ కేకేశాడు చిన్న పీరారెడ్డి.

యెదురింటి ముసలివాడు పైకిలేచి కాళ్లీడ్చుకుంటూ స్కూల్లోకి అడుగుపెట్టాడు.

యెండిన పత్తికొమ్మలా వుంది అతడి ఆకారం. చీకేసిన తాటిముట్టెలాంటి తల... పగిలిన కంటి అద్దాల్లోంచి కళ్లు చిట్లిన పత్తికాయల్లా కనిపిస్తున్నాయి. వొంటిపైన లినన్ లుంగీ మినహా మరో ఆచ్ఛాదన లేదు. పాదాల పగుళ్లలో నల్లటి మట్టి వికృతంగా కనిపిస్తోంది.

''యేం షావలీ! వోటు యేద్దామని వొచ్చినావా?...'' చిన్న పీరారెడ్డి పరామర్శించాడు.

ముసలాయన అర్థమేదో స్ఫురించని శబ్దాలు చేశాడు. ''హూ... మూ.... హూ'' అంటూ.

దస్తగిరి యిండికేషను మార్కును చేతబట్టుకుని ముసలాయన కేసి ఆశగా చూపుల్ని నిగుడించాడు.

''యేలిముద్రా? దస్కత్తా?'' సుబ్బరాజు యింక్‌పేడు ముందుకు చాపాడు.

ముసలివాడు వాళ్లవైపు చూడనైనా లేదు. పోలింగు బూత్‌లోకి వెళ్లి నిలబడ్డాడు.

''అక్కడేం చేస్తున్నావు? వోటు తీసుకెళ్లు'' అంటూ హెచ్చరించాను.

చిన్న పీరారెడ్డి మరో సిగరెట్టు వెలిగించుకుని, ''బూత్‌లోకి వూరికే పోగూడదు కావాలంటే వోటు తీసుకోని పో షావలీ!'' అన్నాడు.

రెండు నిమిషాల తరువాత బూత్‌లోనించి బయటికొచ్చి ''ఊరికే... సూద్దామని...'' అంటూ బోసినోరు విప్పాడు అతను.

''ఆడేం కోతులాడతావుండాయా చూసేదానికి? యిప్పటికి కనీసమంటే యిరవైసార్లు వోటుఏసి వుంటావు... నీకు దినదినానికి కుశాల పెరగతా వుండాదిలే! వోటేసేటట్టుంటే

వెయ్యాల! లేకపోతే గొమ్మునుండాల... మిఠాయిని జూసినట్టు పరిగెత్తుకొచ్చేసినావె!'' యేజెంటు విసుక్కున్నాడు.

''నీ పూర్తిపేరు చెప్పు... వోటర్ల లిస్టులో పేరు చూసుకోని వోటిస్తాను...'' అన్నాడు దస్తగిరి.

ముసలివాడు సమాధానమేమీ చెప్పకుండా మా అందరినీ కాస్సేపు నఖశిఖపర్యంతం పరీక్షచేసి చూశాడు. తరువాత పోలింగ్ బూత్‌వైపునకు తిరిగి దీర్ఘంగా వో నిట్టూర్పు వదిలిపెట్టాడు. వెనుదిరిగి కాళ్లీడ్చుకుంటూ యెదురింటి వరండాలోకెళ్లి కుక్కిమంచంలో పడుకున్నాడు.

అతడి ధోరణేమిటో నాకేమాత్రమూ అంతుపట్టలేదు.

''ముసిలాయనకు మతిస్థిమితం దప్పినట్టుండాది...'' స్వగతంలా గొణుక్కున్నాడు సుబ్బరాజు.

''పిచ్చీ లేదు, పైత్యమూలేదు. ముసిలోడికి తినేసి పడుకుంటే అరిగితిందా? దినదినానికి కుశాలెక్కువైపోతా వుంది. యీడ రికార్డు డాన్సులు జరగతా వుండాయని అనుకుంటా వుంటాడేమో! అట్లా చూసుకోని పోయేదానికొచ్చినాడు'' ఆ ముసలివాడిపైన చిన్న పీరారెడ్డికి అంత కోపమెందుకో అర్థం గావడం లేదు.

మారయ్య తీసుకొచ్చిన గ్లాసుల్ని తీసుకుని టీ చప్పరించసాగాము.

రచ్చబండపైన కూర్చున్న చిదంబరయ్య వో యిరవైయేళ్ల పడుచువాడితో బాతాఖానీ వేస్తున్నాడు.

సగం హెంటిని ప్రదర్శిస్తున్న పిల్లవాళ్లు అయిదారుమంది కిటికీలోంచి స్కూల్లోకి తొంగి చూడటానికి ప్రయత్నిస్తున్నారు.

తలపై కట్టెపుల్లల మోపులతో కొందరాడవాళ్లు వీధినబడి నడచిపోతున్నారు.

సమయం పదికావస్తోంది.

వుదయంనుంచీ కడుపులోకి ఘనపదార్థమేమీ పడలేదు. ఆకలిగా వుంది. సిగరెట్టు వెలిగించుకున్నాను. ప్రతి పూటకూ విందు భోజనాలు దొరుకుతాయని చిదంబరయ్య ఇచ్చిన హామీ గుర్తుకు వచ్చింది. యిప్పుడు మధ్యాహ్నానికి సాదా భోజనమయినా దొరుకుతుందో లేదోనన్న భయం పట్టుకుంది.

దస్తగిరి వోటర్ల జాబితానంతా వొకసారి చదివేసి నట్టున్నాడు. ''సీమబాగిపాడులో యిన్నూట ముప్పయి ఓట్లుండాయి. యీ వూర్లో వాళ్లే యింకా యీ పక్కకు తొంగి చూడలేదు. యింక ఆ వూర్లో వాళ్లెప్పుడు వస్తారో?'' అంటూ చీకాకు పడ్డాడు.

''ఆరీ తీరి అందరూ వోట్ల కోసం యిస్కూలు కాడికొచ్చేటప్పటికి మధ్యాహ్నమై పోయేటట్టుంది. మొత్తం నన్నూట యాభైమందీ వొక్కసారిగా మనపైకొచ్చి పడతారేమో! మనం గాలి పీల్చుకునేదానికి గూడా టయిం లేకుండా సతమతమవుతావుంటే చూసి

ఆనందించాలని యీ వూరోళ్లకు చానా ఆశగా వుండేటట్టుంది'' సుబ్బరాజు గూడా విసుక్కోసాగాడు.

''చిన్న పీరారెడ్డిగారూ! యీ వూళ్లో మీరుగాకుండా మరో యేజెంటెవరూ లేరా?'' అని అడిగాను.

''మా వూళ్లో యిద్దరు యేజెంట్లనే మాటే లేదు సార్! ముందుగానే చెప్పినాను గదా! యీ వూర్లో రెండు దోవల్లో పోయే మనుషులు లేరు. వొకవేళ రెండో యేజెంటు కూడా వుండాలని ఆఫీసర్లు రవాళ్లు వమాట్లాడితే ఇంకో యేజెంటునను గూడా మేమే యేర్పాటుచేసేస్తాం - వాడు నోర్మూసుకుని నామ్‌కేవాస్తే కూచోవల్సిందే!'' అన్నాడు చిన్న పీరారెడ్డి.

''శివయ్య నా పేరు. యెర్రన్నగారి శివయ్య. అది నా పూర్తి పేరు...'' కొత్తగొంతు వినబడగానే తిరిగి చూశాను.

రచ్చబండపైన చిదంబరయ్యతో బాటూ కనిపించిన యువకుడు కనిపించాడు. వయస్సు యిరవైకి యిరవై అయిదుకూ మధ్య ఎంతయినా వుండచ్చు. గడ్డం గీక్కోవడం మానేసి చాలా రోజులయినట్టుంది. నల్లటి ముఖంలో పుల్లటి పట్టుకుచ్చు లాంటి గడ్డం ఒత్తుగా పెరిగిపోయి వుంది. నూనెను నోచుకొని ఉంగరాల జుట్టు చిట్టడివిలా కనిపిస్తోంది. పెద్దకళ్లు... దేన్నో అందుకోవాలన్నట్టుగా పైకిలేచి, కొనదేలిన ముక్కు.... ఎరుపూ తెలుపు రంగుల గళ్ల కాటన్ చొక్కా.... గళ్లలుంగీ....

''నేను వోటేస్తాను సార్...'' అతను మళ్లీ హెచ్చరించాడు.

అంతవరకూ కనురెప్పలు సైతం ఆర్పడం మరచిపోయిన దస్తగిరి వులిక్కిపడి ''నీ నెంబరు... యింటి నెంబరు చెప్పు...'' అంటూ వోటర్ల లిస్టును చేతికి తీసుకున్నాడు.

''యింటి నెంబరు మూడు యిరవై మూడూ.... పేరు యెర్రన్నగారి శివయ్య... తండ్రి పేరు యెర్రన్నగారి కేశవులు...''

చిన్నపీరారెడ్డి కేసి చూశాను.

అతను వోటర్ల లిస్టును చేతికందుకునే ప్రయత్నమైనా చేయలేదు. ఆగంతకుడివైపే నోరు వెళ్లబెట్టుకుని చూస్తున్నాడు.

''నీ నెంబరు మున్నూట యిరవైరెండు... యేదీ నీ ఎడమ చేయి చాపు...'' దస్తగిరి అతడి చేతివేలిపైన యిండికేషను మార్కు వేసేశాడు.

''సంతకం చేస్తావా? వేలి ముద్రా?'' అని అడిగాడు సుబ్బరాజు.

శివయ్య సమాధానమేమీ చెప్పకుండా పేనా అందుకుని సంతకం చేసేశాడు.

సుబ్బరాజు బేలట్ పేపరు జాగ్రత్తగా చింపి, మడతపెట్టి అతడి చేతికిచ్చాడు. ''లోపల యింక్‌పేడూ, ముద్రా వున్నాయి. నీకే గుర్తుపైన వెయ్యాలని వుంటే, దానిపైన ముద్రవేసి, నేను మడిచినట్టుగానే మడిచిపెట్టి...

సలహాలు పూర్తిగాక మునుపే శివయ్య బూత్‌లోకి వెళ్లిపోయాడు.

వొకటి... రెండు... మూడు...

దాదాపు మూడు నిమిషాలు గడిచాయి.

శివయ్య వెలిపలికొచ్చి, మడచిన బాలట్ కాగితాన్ని బాలట్ బాక్సులోకి జొనిపేశాడు. పక్కనేవున్న యినప రేకుతో వోటును పెట్టె లోపలికి తోసేశాడు. తరువాత యినపరేకును టేబుల్‌పైన వుంచేసి, తాపీగా బయటికి నడిచి వెళ్లిపోయాడు.

చుట్టూ చూశాను.

చిన్న పీరారెడ్డి యింకా చూపుల్ని మరల్చుకోలేదు.

దస్తగిరి వోటర్ల లిస్టును టేబుల్‌పైన పరచి పెట్టుకుంటున్నాడు

''సార్! మన బండి కదిలింది...'' మొదటి వోటు బాలట్ బాక్సులో పడిన సంబరం సుబ్బరాజు ముఖంలో స్పష్టంగా కనబడుతోంది.

## 4

మొదటి వోటుపడిన వుత్సాహం కొద్దిసేపట్లోనే నీరుకారిపోయింది.

శివయ్య తరువాత మరెవరూ స్కూలు ఛాయలకైనా రాలేదు.

అతడు వోటువేసి వెళ్లిన తరువాత దాదాపు అయిదు నిముషాలు చిన్న పీరారెడ్డి స్తబ్దంగా కూర్చుని వుండిపోయాడు.

సుబ్బరాజు సీటులోంచీ పైకిలేచి వీధి గుమ్మంలోనుంచీ అవతలికో అడుగు వేసి నిల్చుని ''యెవరూ రావడం లేదు...'' అంటూ పెదవి విరిచేవాడు.

వెంటవెంటనే రెండు సిగరెట్లు వూదిపారేసిన తరువాత ''సీమ బాగిపాడునుంచీ వొక ఆసామయినా వోటేసేదానికి రాలేదు. పెద్దరెడ్డితో మాట్లాడేసొస్తాను...'' అంటూ యేజెంటు చిన్న పీరారెడ్డి కూడా వెళ్లిపోయాడు. పనేమీ లేకపోవడంతో కాలం నత్తనడక నడవసాగింది.

యెండ నడినెత్తి పైకొచ్చింది.

రచ్చబండపైన ఆకులు రాలిన చింతచెట్టు కింద వొక మనిషికి ఆశ్రయ మివ్వగలిగిన నీడయినా మిగలలేదు. చిదంబరయ్య బడిలో కొచ్చి యేజెంటు బెంచీపైన కూర్చున్నాడు.

యెదురింటి వరండాలోని ముసలివాడు కుక్కి మంచానికి అతుక్కుపోయి వున్నాడు. అతడికసలు స్మారకముందో లేదో తెలియడం లేదు.

వీధిలో అటూయిటూ నడిచే వ్యక్తులు దూరంనుంచే బడివైపుకు చూపుల్ని సారిస్తున్నారు.

నాలుగోసారి టీకోసం వెళ్లిన మారయ్య యింకా తిరిగి రాలేదు.

''శవజాగారమంటే మీకు తెలియదుగదా సార్! మాకయితే ఖూనీలూ, ధొమ్మీలు సాధారణం. పీనిగలకాడ గుంతనక్కల మాదిరి రాత్రంతా జాగరం చేసే పని మాకు కొట్టిన పిండి. యిప్పుడు మీరు జేసేఫని ఆ మాదిరే వుండాది...'' చిదంబరయ్య వెకిలినవ్వు నవ్వసాగాడు.

యెంతగా వోటర్లు రాకపోతే మాత్రం పోలింగు డ్యూటీని శవజాగరణతో పోల్చడం నాకు జుగుప్సనే కలిగించింది. చిదంబరయ్య వైపు చూడకుండా ముఖం తిప్పుకున్నాను.

''నాకో డౌటొస్తా వుండాది సార్'' అంటూ మొదలంకించుకున్నాడు సుబ్బరాజు. ''పొద్దున్నుంచీ యేజెంటు ధోరణి గూడా సందేహంగానే వునింది. చూడబోతే యీ వూరోళ్లు యెలక్షన్లు బాయ్‌కాట్ చేసినట్టుగా నాకనిపిస్తా వుంది...''

''యెలక్షన్లనేంది? బాయ్‌కాట్ చేసేదేంది?? యీ ప్రపంచంలో యెక్కడా జరగని పనిని అసోధ్యంగా యీ వూరోళ్లు మాత్రమే చేస్తారా యేమయినానా? మధ్యాహ్నం పైన వోటర్లు వస్తారేమో సార్!'' దస్తగిరిలో యింకా ఆశ చావలేదు.

''యెలక్షన్లు బాయ్‌కాట్ చేసిన వూర్లు నేనొకటి రెండు చూసినాను సార్ నా సర్వీసులో...'' అడ్డు తగిలాడు చిదంబరయ్య. ''తిప్ప సముద్రం దగ్గర ముదినేపాడని వూరుండాది. ఆ వూర్లో వొకసారి యెలక్షన్లప్పుడు యే పార్టీకిగానీ వూళ్లోకి రానీకుండా కట్టుదిట్టం చేసేసినారు. వూరు గెవిలోనే వోటు కోసం యెవరూ రానక్కర్లేదని బోర్డు పెట్టేసినారు. పోలింగునాడు వొక్క వోటయినా వెయ్యలేదు వాళ్లు. ఆ మాదిరే వోతూరి యూపీలో జరిగిందని పేపర్లో గూడా యేసినారు...''

''యిలా బోరుగా వుంటుందని తెలిసుంటే నా పాకెట్టు ట్రాన్సిస్టరు తెచ్చుకునేవాణ్ణి!'' నేను వాపోయాను.

''యీ వూరికి డైలీ పేపరు కూడా వచ్చేటట్టు లేదు'' సుబ్బరాజు గొణుక్కున్నాడు.

చిదంబరయ్య బీడీ వెలిగించుకున్నాడు.

తనివితీరా పీల్చిన పొగను పూర్తిగా వదిలి పెట్టకముందే ''సార్, సార్... విన్నారా?'' అంటూ పైకి లేచి నిల్చున్నాడు.

''యేమైందేమైంది?....'' దస్తగిరి గాబరా పడ్డాడు.

''సౌండు... జావా సౌండు...''

''అవును... జావానే!...''

''యీ పక్క యిలాకాలో జావా యెవరికుండాది పెద్దరెడ్డికి తప్పితే!... వచ్చేస్తా వుండాడు... రాజకుమార్రెడ్డి వచ్చేస్తా వుండాడు... పొద్దున్నుంచీ బోరుగా వునిందని మహా బాధపడిపోయినారు గదా! వడ్డీవారిడి తీర్చేసేదానికి వచ్చేస్తావుండాడు. రాజకుమార్రెడ్డి వచ్చేస్తావుండాడు...'' చిదంబరయ్య వీధిలోకి పరుగెత్తుకెళ్లిపోయాడు.

రెండు మూడు నిముషాల్లోనే యెర్రరంగు జావా రచ్చబండ దగ్గరికొచ్చి ఆగింది.

వాహనానికి దీటయిన వ్యక్తి కిందికి దిగాడు.

దాదాపు ఆరడుగుల పొడవున్నాడు అతను. మధ్యలో పాపిడి తీసిన జుట్టు అటూ యిటూ గొర్రెపిల్ల కొమ్ముల్లా సుడి తిరిగి నిల్చుంది. గుబురు వెంట్రుకల కనురెప్పలకింద నల్లకళ్లద్దాలు... అతికించినట్టున్న ముక్కు... మెలి తిరిగిన గుబురు మీసాల కింద పెదవులు కనిపించడం లేదు. పొట్టిచేతుల ఖద్దరు చొక్కా జేబులోంచీ సిగరెట్టు పెట్టె కనిపిస్తోంది. టెరీకాటన్ పంచె కట్టుకున్నాడు. పాదాలకు ఆకుచెప్పులు... యెడమచేతికి రిస్టువాచీ...

దగ్గరకు వెళ్లి మిలట్రీ సెల్యూట్ చేశాడు చిదంబరయ్య.

తలపైకెత్తి వోసారి చూసి, మోటార్ బైక్‌ను స్టాండువేసి నిలబెట్టాడు అతను.

దస్తగిరి స్కూలు బయటకు గెంతి ''గుడ్‌మార్నింగ్ సార్!'' అంటూ చేతులు జోడించాడు.

ప్రతి నమస్కారంగా చేయి వూపి ''వొక కుర్చీ యెత్తుకొచ్చి చెట్టుకిందెయ్యి'' అన్నాడు అతను.

చిదంబరయ్య బడిలోకి దూసుకొచ్చాడు.

''నా కుర్చీ తీసుకొనిపో చిదంబరయ్యా! నేను బెంచీపైన్నే కూర్చుంటాను...'' అన్నాడు దస్తగిరి.

కుర్చీ తీసుకెళ్లి రచ్చబండపైన వేశాడు చిదంబరయ్య.

రాజకుమార్రెడ్డి కుర్చీలో కూర్చున్నాడు.

జేబులోంచీ సిగరెట్టు పెట్టెను తీసుకొని సిజర్ లైటరుతో సిగరెట్టు వెలిగించుకున్నాడు.

యెదురింటి వరండాలోని ముసలివాడు పైకిలేచి నిల్చున్నాడు. వో నిముషం తర్వాత వెనుదిరిగి యింటిలోపల కెళ్లిపోయాడు.

''యిక్కడ యెండగా వుండాది. యిస్కూల్లో కూర్చోండి సార్!'' వీలయినంత వినయాన్ని ప్రదర్శిస్తూ అన్నాడు చిదంబరయ్య.

''యిస్కూల్లోనా?... ఆడ నాకేం పని?'' తలైనా యిటు తిప్పకుండా, వాలుచూపులు చూస్తూ ప్రశ్నించాడు రాజకుమార్రెడ్డి.

సమాధానమేం చెప్పాలో తోచకపోవడంతో చేతులు నలుపుకుంటూ పళ్లికిలించాడు చిదంబరయ్య.

టీ గ్లాసులతో బడిదాకా వచ్చిన మారయ్య, రచ్చపైన రాజకుమార్రెడ్డి కనిపించడంతో రాయిలా నిలబడిపోయాడు.

అతడినోమారు పైకీ కిందికీ చూసి ''నువ్వేనా తోట్లోడు... కాఫీలు యిస్కూల్లో యిచ్చేసినాక మణోర్ని పిల్చుకోనిరా...'' అన్నాడు రాజకుమార్రెడ్డి.

టీ గ్లాసులు మా ముందుంచేసి, పరుగు పరుగునా వూళ్లోకి వెళ్లిపోయాడు మారయ్య.

చిదంబరయ్య బడి గుమ్మం దగ్గరికొచ్చి నిల్చున్నాడు.

రచ్చబండ దగ్గరికి యింతలో సైకిలొకటి వచ్చి ఆగింది. యేజెంటు చిన్నపీరారెడ్డి సైకిలు స్టాండయినా వేయకుండా, ''మనేగార్ని పిల్చుకోనొస్తానన్నా!'' అని అడిగాడు.

''తోటోడ్ని పంపించినాను. నువ్వు పొయ్యి ఇంటింటికి వొకడ్ని రమ్మన్నానని చెప్పి తోలుకొనిరా...''

''యెండగా వుండాది... గొడుగు దెప్పిస్తానన్నా!''

''పెత్తనాలు మానేసి, నేను జెప్పిన పని చెయ్యి...''

సైకిలును అక్కడ వుంచేసి, వూరివైపు కదిలాడు చిన్న పీరారెడ్డి.

''చిదంబరయ్యా! సంగతేమిటి?'' మెల్లగా, గొంతు తగ్గించి అడిగాను.

''నాకు తెలవదు సార్! జనాన్నంతా పిలిచి, వరసగా వోటెయ్యమని చెప్తాడేమో!'' చిదంబరయ్య గూడా కిటికీ దగ్గరికొచ్చి రహస్యంలా గొణిగాడు.

యాభైయేళ్ల వయసున్న వ్యక్తి రచ్చబండ దగ్గరికొచ్చి నిల్చుని చేతులు జోడించి నమస్కరిస్తున్నాడు.

''సార్ సార్! ఆయనే మనేగారు ప్రభాకర్రెడ్డి... మనేగార్లనూ కర్నాలనూ తీసేసి నారనుకోండి! అయినా యీ వూర్లో మాత్రం యీయన పెద్దరికానికి సేగిరాలేదు. అందరూ యీయనన్ను మనేగారనే పిలుస్తారు...'' కిటికీ కవతలినుంచే గొణిగాడు చిదంబరయ్య.

''యెండలోనే కూర్చున్నారే! గొడుగయినా తెప్పిస్తానన్నా!'' అంటున్నాడు మనేగారు ప్రభాకర్రెడ్డి.

అతడి ప్రశ్నకు సమాధానమైనా యివ్వకుండా ''వూళ్లోనే వుండావా నువ్వు?'' అని ప్రశ్నించాడు రాజకుమార్రెడ్డి. అతడి గొంతుకలో కోపతాపాలేమీ ధ్వనించడం లేదు. తాపీగానే మాట్లాడుతున్నాడతను.

''నేనేడికి పోయినానన్నా! యింట్లోనే వుండాను...''

''వుండు వుండు... యింట్లోనే వుండు... కడుపు నిండుకూ తినేసి, చాప పరుచుకొని పండుకో... అదే మనేగారు చెయ్యాల్సిన డూటీ...''

మనేగారు వొకటి రెండు నిముషాలసేపు తటపటాయించి ''యేం జరిగిందన్నా!'' అంటూ ప్రశ్నించాడు.

సిగరెట్టు పీకను ఆర్పకుండానే దూరంగా విసిరేశాడు రాజకుమార్రెడ్డి. జేబులోంచి రుమాలును పైకిలాగి ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. ''వూళ్లో జనాన్నంతా పిల్చుకోని రమ్మని చిన్నపీరారెడ్డిని పంపించినాను. రానీ... నీకే తెలుస్తాది యేమయిందో''

మెల్లమెల్లగా రచ్చబండ దగ్గర సంరంభం మొదలయ్యింది. వూరిజనమంతా నమస్కారాలు

చేసుకుంటూ రచ్చబండ దగ్గరికి రాసాగారు.

''చిదంబరయ్యా! వొకమాట!...'' అన్నాను.

అతను లోపలికొచ్చి దగ్గరగా నిల్చుని ''యేం సార్?'' అని అడిగాడు.

''పోలింగు స్టేషనుకు దగ్గర్లో యీ మాదిరిగా జనం చేరగూడదు. అది రూలు...'' అన్నాను.

''యిక్కడ రూలు గీలు జాన్తానైసార్! రాజకుమార్రెడ్డి మాటే రూలు! అయినా ఆయన మన జోలికొచ్చి, అడ్డంపడితే గదా రిస్కు. ఆయనుంటే మనకు కాపలాగా పెద్దపులొచ్చి కూచున్నట్టే లెక్క.... మీరు మాట్లాడకుండా కూర్చోండి. మనం ఆయన మాటకు బోవద్దు. ఆయన మన జోలికి రావద్దు... యెవురి సేఫ్టీ వాళ్లు జూసుకోవాల... మీరు మాత్రం రూల్సు గీల్సని గెట్టిగా అనద్దండి సార్! పెద్దరెడ్డి విన్నాడంటే కొంపలు మునగతాయి. ముందుగానే చెబ్తావుండాను. గొమ్మున కూర్చోండి''.

జరుగుతున్న సంరంభంలో ప్రధానపాత్ర నాదిగాదన్న సంగతి అర్థమయింది. ప్రేక్షకుడిలా నోరు మూసుకుని, కిటికీలోంచీ చూస్తూ కూర్చున్నాను.

మారయ్య వూళ్లోంచీ పెద్ద బెంచీని తీసుకొచ్చి రచ్చబండ పైన వేసేశాడు.

బెంచీపైన మనోహరితోబాటూ యేజెంటు చిన్నపేరారెడ్డి కూడా కూర్చున్నాడు.

''యేం జరిగిందన్నా!'' మనోహరు ప్రభాకరరెడ్డి ప్రశ్నించాడు మళ్లీ.

అతడిని కాస్సేపు ఆగమన్నట్టుగా తలవూపి ''అందరూ వచ్చేసినట్టేనా?'' అంటూ జనాన్నంతా కలయజూశాడు రాజకుమార్రెడ్డి.

రచ్చబండ ముందు దాదాపు యాభైమంది గుమిగూడిపోయారు. అందరూ వొకసారి వెనుదిరిగి తోటివాళ్లను పరీక్షించి చూసుకోసాగారు.

''కేశవులూ.... వచ్చినావా నువ్వు?''

మోకాళ్లవరకూ పైకెత్తి కట్టుకున్న పంచె మాత్రమే ఆచ్ఛాదనగా గలిగిన అరవయ్యేళ్ల వ్యక్తి ముందుకొచ్చి నమస్కరించాడు ''వచ్చినానన్నా!''

జేబులోంచి సిగరెట్టు పాకెట్టు పైకి తీసుకుని సిగరెట్టు అంటించాడు రాజకుమార్రెడ్డి - ''చెప్పు... నువ్వే చెప్పు... మనూరంటే యెట్లాంటి వూరు'' అని ప్రశ్నించాడు.

అర్థాంతరంగా వూడిపడిన ప్రశ్నకు సమాధానమేం చెప్పాలో కేశవులుకు తోచినట్టు లేదు. బిక్కమొహం పెట్టుకున్నాడు.

''అన్ని వూర్ల మాదిరి వూరా మనది?''

''కాదన్నా!''

''యెందుగ్గాదు?''

''యెందుకంటే...''

''చెప్పు కేశవులూ... అదిగూడా తెలియదా?'' మనేగారు కల్పించుకున్నాడు.

''యెందుకో చెప్పు.... వనూర్లో పెద్దరెడ్డి కాడ్నించీ తోటోడుందాకా అందరూ వొకమాట పైన్నే వుంటారు. ఆమాటే చెప్పు''

''అవునన్నా!''

''అవునుగదా! యిప్పుడు చెప్పు... నువ్వు బుద్ధి దెలిసినాక యెన్నిసార్లు వోట్లేసినావు?''

''చాలాసార్లే యేసినానన్నా!''

''మీ నాయన నీకు యెంతిచ్చి పోయినాడు''

''రెండెకరాలు...''

''యిప్పుడెంతుండాది?''

''వొక యెకరా...''

''యింకో యెకరా యేమయింది?''

''అమ్మేస్తిని గదన్నా!''

''యెందుకమ్మేస్తివి?''

''కూతురు పెండ్లికి...''

''నీ భూమిలో యేమి పండతాది?''

''యేంపండతాది అన్నా! వానలొచ్చి వంకలుదొర్లినాయా యేమయినా పండేదానికి?...''

''అయితే యెట్ల బతకతా వుండావు?''

''అట్లడగుతావుండావేందన్నా? తెల్లారిపోయినోడ్ని పత్తికోసే దానికి యిప్పుడే గదా వొస్తావుండాను...''

''పత్తితోటెవురిది?''

''నీదేగదన్నా!''

''వొకవేళ అది నాదిగాదని అనుకో... అప్పుడు నువ్వేడికి పొయ్యిందువు? నీ గతి యెట్లుండేది?''

''.....''

''చెప్పు కేశవులూ! పల్లాకుల పాలయిపోయి వుందునని చెప్పు. నిజం చెప్పేదానికి భయమేల?'' యీసారి చిన్నపీరారెడ్డి కేశవుల్ని ఆదుకున్నాడు.

''యీ వూరికి బోరింగు యెప్పుడొచ్చింది?''

''నాలుగేళ్లముందన్నా!''

''యెవురు యేయించింది?''

''....''

''గవర్మెంటోళ్లతో యెన్నిసార్లు కొట్లాడి, దీన్ని యీ వూరికి దెప్పించినానో నీకు తెలవదా?''

''తెలుసు...''

''యీ వూరికి యిస్కూలు, పశువుల ఆస్పత్రి, కరెంటు... యివన్నీ తెచ్చేదానికి యెంత గగనమయిందో తెలుసునా నీకు? యీ వూర్లో వుండే పోలీస్టేషన్ను యెత్తేస్తామని అంటావుంటే నేనెన్నిసార్లు అయిద్రాబాదుకు బొయ్యి యెత్తేయకుండా నిలబెట్టినానో తెలుసునా నీకు?...''

''తెలుసును...''

''యీ వూర్లోకి యేం గావాలన్నా నేను పూనుకుంటేనేగదా అవతావుంది. నేను లేకుంటే మీరందరూ యేమయిపోయుందురు?''

మౌనం.

''ఆ సంగతి వుండనీ... నిన్నరాత్రి మీకంతా యేం జెప్పినాన్నేను...''

జనంలోనుంచి మరో వ్యక్తి ముందుకొచ్చి ''ఈసారి వోట్లు వెయ్యద్దు అని చెప్పినావు గదన్నా!'' అన్నాడు.

''యెందుకు? వూరికేనే జెప్పినాన?''

''యిర్వై దినాలకు ముందే చెప్పినావు గదన్నా! యీసారి యే పార్టీ వాళ్లయితే భజన మందిరం కట్టుకునే దానికి దుడ్డిస్తారో వాళ్లకే వోటేద్దామని అన్నావు. యెవుడూ ముగసలేదు. అందుకని నిన్న - యీ తడవ యే పార్టీవానికిగానీ వోటెయ్యగూడదని ఖరాకండీగా జెప్పేసినావు...''

''చెప్పినానా, లేదా?''

''చెప్పినావన్నా! లేదని యెవుడైనా అంటే వానికీరోజు భూమ్మీద నూకలయినట్టే!'' జనంలోంచి యింకో వ్యక్తి రోషంతో పంచె పైకెగగట్టుకుంటూ ముందుకొచ్చాడు.

''కోప్పడొద్దు నారాయణా! కోపతాపాల్తో పనులు జరగవు. శాంతంగా ఆలోచించి చెయ్యాల పనులన్నీ...'' రాజకుమార్రెడ్డి సిగరెట్టు పీకను అవతలికి గిరవాటు పెట్టాడు. ''భజనమందిరం గావాలని నాకోసం చెప్పినానా నేను? లేదుగదా? వూర్లో గుడీగోపురం లేకపోతే వూరికేమయినా మంచిదా? మనుషులన్నాక భక్తీ వయిరాగ్యం గూడా వుండాలగదా! యీసారి ఎట్లయినా వూర్లో భజనమందిరం గూడా వుండాలగదా! యీసారి యెట్లయినా వూర్లో భజనమందిరం గట్టించాలని మీరేగదా నా దగ్గరికొచ్చి చెప్పింది? అందుకనే గదా నేను భజనమందిరం గట్టేదానికి లెక్కవడిస్తే వాడికే వూర్లో వాళ్లంతా వోట్లేస్తామని మాటిచ్చినాను. యే పార్టీ వాడొచ్చి సీటుపైన కూర్చున్నా మనకేం ఒరగతాది? మళ్లా కనబడేది యెలక్షన్లప్పుడే గదా! దీపముండేటప్పుడే యిల్లు సర్దుకోవాలగదా! అందుకనే గదా నేను మీ అందరి తరపునా నడుం గట్టుకొని మాటిచ్చినాను! వోటుఅంటే కాగితం గాదు. దానికుండే

పవరు పెద్దది. వోటులంటే మనచేతిలో వుండే గన్ను మాదిరి. దాన్ని సరిగా వాడుకున్నంత కాలమే మనకు సేఫ్టీ... అన్ని యివరాలూ చిలక్కి జెప్పినట్టుగా చెప్పినానా లేదా మీకు?''

యెవరూ పలకలేదు.

''బెల్ల గొట్టిన రాళ్ల మాదిరిగా నిలబడ్తే సరిపోయిందా? పెద్దరెడ్డికేమయినా నష్టమొచ్చిందనా యింతసేపు గొంతుబొయ్యేటట్టు వాట్లాడింది? మీ కొంపలు గుండమవకుండా కాపాడాలనే గదా ఆయన తాపత్రయం! జవాబు చెప్పేదానికి నోరుగూడా లేదా మీకు'' చిన్నపీరారెడ్డి లేచి నిల్చుని వుగ్రరూపం దాల్చేశాడు.

''యిగో పీరారెడ్డీ! మీకీవమాదిరిగా శిగమొచ్చేటట్టయితే నేను లేచి సక్కా యెలబారిపోతాను. శాంతంగా ఆలోచన చెయ్యమన్లేదా నిన్ను?'' రాజకుమార్రెడ్డి విసుక్కున్నాడు.

చిన్నపీరారెడ్డి ముఖం ముడుచుకుని కూర్చున్నాడు.

''నా దగ్గరికి సుధాకర్రెడ్డి వచ్చినాడు, వెంకటసుబ్బారెడ్డీ వచ్చినాడు. వూర్లో భజన మందిరానికెవుడు డొనేషనిస్తే వాడికి మొత్తం మా వోట్లన్నీ పడతాయని నేను మాటిచ్చినాను. సరేనని తలాడించేసి పోయినోళ్లు తిరిగి మళ్లీ చూడలేదు. అంటే యేమని అర్థం. నా మాటంటే నయాపైసాగ్గూడా లెక్కలేదని అర్థం! నా మాటంటే నా వొక్కడి మాటనా అర్థం? మనూరంటే లెక్కేలేదని అర్థం. అందుకని - మనూరంటే యేందో, మనూరి ప్రజలంటే యేందో రుచి చూపిద్దామన్జి నేను పోలింగు స్టేషన్లోకి అడుగుపెట్టద్దని చెప్పినాను. చెప్పినానా లేదా?''

''చెప్పినావన్నా!'' జనంలోంచీ సమాధానం వచ్చింది.

''చెప్పి యేం లాభం! నా మాటంటే ఖాతర్లేనప్పుడు చెప్పి బావుకునేదేముంది? నా మాటంటే నా వొక్కడి మాటని గాదుగదా! మనూరంటే మనోళ్లకే కాతర్లేదు. మీ అందరి బదులూ మాటిచ్చినందుకు నన్ను యెర్రిముండా కొడుకును జేసేసినారు...''

''యేం జరిగిందో చెప్పన్నా! యెవురన్నా వోటేసుంటే చెప్పు.. వాన్నిప్పుడే యీ చల్లని చెట్టుకింద పూడ్చిపెట్టేస్తాను...'' గుంపులోంచి కలకలం బయల్దేరింది.

''మీకీవమాదిరి శివమొచ్చేట్టయితే నేనీడ గూర్చునేదెందుకు? ఆలోచన లేకుండా పోతావుంది మీకు. జాతర్లో ఉగ్రమొచ్చినట్టుగా మీకు శివమొచ్చేటట్టుంటే, ముందుగానే చెప్పండి. నేను యెలబారిపోతాను'' యీసారి రాజకుమార్రెడ్డి తీవ్రంగా కసురుకున్నాడు.

''యెవుడైనా వోటేసినాడేమో చెప్పన్నా!'' మనేగారు ప్రశ్నించాడు.

''చూసినారా యెట్లుండాదో కథ!'' రాజకుమార్రెడ్డి యెగతాళిగా చిరునవ్వు నవ్వాడు. ''మీ మనేగారు నన్ను అడగతా వుండాడు. నేనేనా యీ వూళ్లో మనేగారు? నాకు ఆయన్జెప్పాల్నా? నేను ఆయన చెప్పాల్నా?''

మనేగారు తలొంచుకున్నాడు.

''యేం జరిగిందో చెప్పన్నా! వోటెవ్వురైనా యేసినారా?'' జనంలోంచి అడిగారెవరో.

''చెప్పు పీరారెడ్డీ! వోటేసిందెవ్వురో చెప్పు'' అన్నాడు రాజకుమార్రెడ్డి.

అందరూ చిన్న పీరారెడ్డి కేసి చూడసాగారు.

వో నిముషం సేపు అందరినీ కలయజూసిన తరువాత పెదవి విప్పాడు చిన్న పీరారెడ్డి - ''శివయ్య... కేశవులు కొడుకు శివయ్య...''

కేశవులు భయంతో కంపించిపోయాడు.

రెండుమూడు నిముషాల తరువాత చేతులు నెత్తిపైన పెట్టుకుని నిలువునా నేలకొరిగి పోయాడు.

గుంపంతా వెనుదిరిగి అతడివైపే చూడసాగారు.

ఛాతీకి అతికించినట్టుగా అతడి తల వొంగిపోయింది. తల వెంట్రుకల్లో తగులుకున్న పత్తి కంపలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

''మూసిన ముత్తెం, పాసిన పగడం మాదిరి కూర్చుంటే సరిపోయేనా? సమాధానం చెప్పు'' మనోహరు కస్సుమన్నాడు.

''నాకేమీ తెలవదన్నా! పత్తి కోసేదానికి పొద్దున పోయినోడ్ని! యిప్పుడొస్తా వుండాను... మావోడు అట్టాంటోడు గాడు'' గొంతు బొంగురు పోవడంతో గుక్కిళ్లు మింగసాగాడు కేశవులు.

''అంటే నేనబద్ధం చెప్పినాననా నువ్వనేది... నేను కండ్లారా జూసినాను. సాక్ష్యం గావాలంటే పోలీసు చిదంబరయ్య దగ్గిరే చెప్పిస్తాను...'' చిన్న పీరారెడ్డి విరుచుకపడ్డాడు.

''శివయ్య- అదేనా పేరు? యెక్కడికి పోయినాడు?'' రాజకుమార్రెడ్డి మాత్రం ప్రశాంతంగానే కనిపిస్తున్నాడు.

''మెడబట్టుకోని యీడ్చుకొస్తానుండన్నా!'' యెవడో క్రీంకారం చేశాడు.

''చూడు నారాయణా! వాడి వొళ్లుమీద దెబ్బ పడిందో, నేను మళ్లీపక్క తలతిప్పి చూడను. తెలిసిందా?'' రాజకుమార్రెడ్డి గొంతు ఖంగుమంది.

శివయ్య కోసం నలుగురయిదుగురు వూళ్లోకి బయల్దేరారు. గుంపులో కలకలం బయల్దేరింది.

ఆ శబ్దమేమీ వినబడనట్టుగా రాజకుమార్రెడ్డి మరో సిగరెట్టు అంటించాడు.

కేశవులు యింకా అలాగే కాలుతున్న నేలపైన చతికిలబడి పోయి వున్నాడు.

పెద్దగా కారుబారు చేసుకుంటూ పోలీసు జీపొచ్చి వీధిలో ఆగింది.

''సార్, ఫ్లయింగ్ స్క్వాడ్!'' చిదంబరయ్య చెవి కొరికాడు.

జీపులోంచి సబ్ ఇన్స్పెక్టరు దిగాడు.

''యేమన్నా! యెండలో కూర్చున్నారు?'' అంటూ నేరుగా రాజకుమార్రెడ్డినే

పలకరించాడు అతను.

''మాకు యెండేంది, వానేంది, అంతా వొకటే సార్! నీడలో కూర్చునేదానికి మేమేమైనా మీ మాదరిగా వుద్యోగస్తులమా?'' పెద్దరెడ్డి సరాయించాడు.

''మారయ్యా! యిన్‌స్పెక్టరు సార్‌కు కుర్చీ తీసుకురాపో!'' మనేగారు మర్యాద చేయబోయాడు.

''వొద్దన్నా! డ్యూటీపైనొచ్చినాను. ఫ్లయింగుస్క్వాడు. యింకా నాలుగు బూతులు విజిట్ చెయ్యాల'' యిన్‌స్పెక్టరు కదలబోయాడు.

''కొంచెం చల్లటి మజ్జిగయినా దెప్పిస్తాను. తాగేసిపోండి సార్'' అన్నాడు రాజకుమార్‌రెడ్డి.

''బూత్ లోపలికి పొయ్యేసి వస్తానన్నా'' అంటూ వెనుదిరిగాడు యిన్‌స్పెక్టరు.

అతడికి సెల్యూట్ కొట్టాడు చిదంబరయ్య.

''పీవో ఎవురు?''

''నేనే సార్!'' పైకి లేచాన్నేను.

''అంతా పీస్‌ఫుల్‌గా జరగతావుందిగదా సార్!'' అతను ప్రశ్నించాడు.

అతడికి దగ్గరగా వెళ్లి ''వోటేసేవాళ్లు వుంటేగద సార్! యిప్పటికి పోలయింది వొక వోటే! ఆ వొక్క వోటు పడినందుకే బయట పంచాయతీ జరుగుతోంది...'' అన్నాను.

''బయటేం జరిగితే మీకేం పోయింది సార్! ఖాళీ బాలట్ బాక్సులు తీసుకొని పోతే మీకేమయినా ఫైన్ వేస్తారా యేమైనానా? మీ పాటుకు మీరు సాయంత్రందాకా కూర్చొని, పాక్ చేసుకొని వచ్చేయండి. మిగిలిన కథ మీకొద్దు. యీ బూత్‌లో రిస్క్ వుండదని నాకు తెలుసునులెండి. పెద్ద రెడ్డి బయటే కూర్చోనుండాడంటే ప్రొటెక్షనుకు యింకెవరూ వొద్దు...'' మాట్లాడుతూనే అతను బయటికెళ్లి పోయాడు.

''అన్నిచోట్లా పోలింగు బాగా జరగతావుండాదా సార్?'' అతడిని పరామర్శించాడు రాజకుమార్‌రెడ్డి.

''అన్ని వూళ్లూ మీ వూరు మాదిరిగా పీస్‌ఫుల్‌గా వుంటాయాన్నా! పెద్దవెంకటాపురంలో పెద్ద గొడవలయినాయి.వొకడికి పుచ్చెగిరిపోయింది. పోలింగు కాన్సిలయింది. ప్రొటెక్షన్లతో రేపు మళ్లా పోలింగు జరిపించాల. సాలూరు, పూలపెంటల్లో పోలింగెట్లా జరగతావుందో తెలియదు. పోయి విజిట్ చెయ్యాల... యింక మేమొస్తామన్నా!''

''మజ్జిగొచ్చేసింది, తాగేసిపోండి సార్!''

యిన్‌స్పెక్టరుతోబాటూ ఇద్దరు కానిస్టేబుళ్లు గూడా మజ్జిగ గ్లాసుల్ని ఖాళీ చేసేసి జీపునధిరోహించారు.

మట్టిబాటపైన దుమ్మును రేపుకుంటూ జీపు వెళ్లిపోయింది.

రచ్చబండ దగ్గర మరో అయిదారు నిముషాల కాలం బరువుగా దొర్లింది.

ఇంతలో శివయ్య కోసం వెళ్లిన వ్యక్తులు పరుగుపరుగునా రచ్చబండ దగ్గరికొచ్చేశారు. రాజకుమార్రెడ్డి ప్రశ్నించేటంతవరకూ వోపిక వహించే సహనం వాళ్లకున్నట్టు లేదు. ''వస్తా వుండాడు... శివయ్య యింట్లోనే వుండాడు. వస్తావుండాడన్నా!'' అంటూ ఉత్సాహంతో ప్రకటించేశారు.

అందరూ వెనుదిరిగి వీధి మలుపుకేసి చూడసాగారు. శివయ్య నింపాదిగా రచ్చబండ దగ్గరికొచ్చి నిల్చున్నాడు. అతడెవర్నీ చూడడం లేదు. తలవంచుకుని వున్నాడతను.

అంతా మౌనంగా వుండిపోయారు.

రాజకుమార్రెడ్డివైపూ, శివయ్యవైపూ వుత్కంఠతో మార్చి మార్చి చూడసాగారు.

రాజకుమార్రెడ్డి రెండు నిముషాల తరువాత ''నీ కొడుకొచ్చినాడు. నువ్వే అడుగు...'' అన్నాడు కేశవులుతో.

కేశవుల్లో ఛలనం కనిపించడం లేదు.

అలాగే నేలకంటుకు పోయినట్టుగా వుండిపోయాడు.

''పెద్దరెడ్డి అడగతావుండ్లా? సమాధానం చెప్పేదానికి నోరు పడిపోయిందా నీకు?'' గుంపులోంచీ కోపంతో మండిపడుతున్న వ్యక్తి వొకడు ముందుకురికాడు.

కేశవులు ''నేనేమని అడిగేదన్నా! నువ్వే అడుగు'' అంటూ యేడుపును తొక్కిపట్టే ప్రయత్నం చేశాడు.

''నీ కొడుక్కు దుర్గవరంలో కాలేజీ సీటు కావాలంటే నువ్వొచ్చి అడిగినావా? లేకపోతే నీ కొడుకొచ్చి నన్నడిగినాడా? నువ్వు భలే తెలివైనోడుగా వుండావు కేశవులూ! నిన్నగాక మొన్న - నీ కొడుకు డిగ్రీ తీసుకుని యింట్లోనే యీగలు తోలుకుంటా కూచోనుండాడని నా దగ్గరికొచ్చి మొరబెట్టుకునింది యెవరూ? నువ్వా, నీ కొడుకా? నేను స్పెషల్జీచరుద్యోగం తీసిస్తాననింది నీతోనే లేకపోతే నీ కొడుకుతోనా? యిప్పుడు మాత్రం నేనే వాడినడగాల్నా? నేనూ, వాడూ మాట్లాడు కుంటావుంటే నువ్వు వీధినాటకం చూసినట్టుగా చూద్దామని అనుకోనుండావు...'' రాజకుమార్రెడ్డి నవ్వుతూనే నిష్ఠూరపోసాగాడు.

కేశవులు వంచిన తల పైకెత్తలేదు.

''వూరికే మాటలేలన్నా! నువ్వడగకపోతే నేనే అడగతాను'' మనోహరు మండిపడసాగాడు. ''చెప్పురా శివయ్యా! నువ్వు వోటేసింది నిజమేగదా?''

శివయ్యగూడా శిల్పంలా నిలుచునే వున్నాడు.

''యెందుకేసినావు?''

''వూరికే వుగ్రం తెచ్చుకోవద్దు. వూళ్లో మనం దండోరా యేయించినప్పుడు వీడు లేడేమో! సమాచారం విచారించి తెలుసుకోకుండా గుడ్డెద్దు చేన్లో పడినట్లుగా కస్సుబుస్సు మనద్దు....'' రాజకుమార్రెడ్డి మందలించాడు.

'''దండోరా యేసినప్పుడు వీడు యీడనే రచ్చబండపైన్నే వున్నాడన్నా! దానికి సాక్షికం

నేనే! మేమిద్దరూ యిక్కడ కూర్చొని వున్నప్పుడే దండోరా యేసినారు...''- గుంపులో నుంచీ సమాధానం వచ్చింది.

''దండోరా యేసిన సంగతి తెలిసిగూడా వోటెందుకేసినావు? యెలక్షన్లో పోటీచేస్తా వుండేవాళ్లలో యెవురైనా నీకు తెలుసునా?''

''నువ్వు గొమ్మునుండన్నా! వీని మొఖానికేంది? పెద్దపెద్దోళ్లు తెలిసేదేంది?''

''చెప్పు... యెందుకు వోటేసినావు?'' యిక తప్పదన్నట్టుగా రాజకుమార్రెడ్డి శివయ్యనే ప్రశ్నించాడు.

అయినా అతడు ఉలకలేదు, పలకలేదు తలవంచుకుని నేల చూపులు సారిస్తూనే వున్నాడు.

''మీ అబ్బాకొడుకులిద్దరూ చెయ్యాల్సిందంతా చేసేసి, యిప్పుడు మూసంగిల మాదిరి నిలబడితే అర్థమేంది? పెద్దరెడ్డి సాయంగా వచ్చి అడిగితే గూడా జవాబు చెప్పేదానికి నోర్రాలేదా మీకు?'' యీసారి చిన్న పేరారెడ్డికి శివమెత్తుకొచ్చింది.

''నేనేం చెప్పుదునన్నా!'' కేశవులు అతికష్టంమీద లేచి నిల్చున్నాడు. అతడి కాళ్లింకా వణుకుతూనే వున్నాయి. వొళ్లంతా దుమ్ముగొట్టుకుపోయి, మట్టితో చేసిన బొమ్మలా కనిపిస్తున్నాడు. చేతులు రెండూ జోడించి, మాటలు కూడబలుక్కుంటూ చెప్పసాగాడు.

''పుట్టి భూమ్మీదబడి ఇన్ని సంవత్సరాలయింది. యేనాడైనా సడిసప్పుడూ చేసినానా నేను? యింట్లో వుండానో లేదో యీధిలో ఎవురికైనా తెలుసునా? నా సంగతి నేనే ప్రత్యేకంగా చెప్పాల్నా నీకు? యీ పొద్దు నా కొడుకు మూలంగా యీధిలోకి రావాల్సొచ్చింది... వాడింకా పిల్లోడు... తెలిసి చేసిన పనిగాదు...''

''పెండ్లిచేసుంటే యీపాటికి బిడ్డతండ్రి అయివుండేవాడు. వాన్ని బట్టుకొని పిల్లోడంటా వేందిరా కేశవులూ? వాడు మాత్రమేనా? నువ్వు గూడా పిల్లోడే గదా!'' మునేగారు యెకసెక్కం చేయసాగాడు.

కేశవులు మరి నోరు తెరవలేదు.

రాజకుమార్రెడ్డి లేచి నిల్చున్నాడు.

జేబులోంచి సిగరెట్టు పెట్టెను పైకి తీసుకుని సిగరెట్టు వెలిగించుకున్నాడు. కళ్లద్దాలు చేతికి తీసుకుని, రుమాలుతో ముఖం తుడుచుకుని, మళ్లీ తగిలించు కున్నాడు.

''సరే! నేను పోతావుండాను. కేశవులూ! నేనేమీ మాట్లాడను. నువ్వే అడిగి సమాచారం తెలుసుకో! తెలుసుకున్నాక మీరూ మీరూ మాట్లాడుకొని, వానికేం శిక్షెయ్యాలో గూడా మీరే నాకు చెప్పండి. దీన్తో నాకు సంబంధమేమీ లేదు. అంతా మీరే తేల్చుకొని సంగతి తెలుసుకొని కడాన నాకు సమాచారం చెప్పండి...'' జనం వైపు తిరిగాడు. ''యిదో, యిదే చెప్తావుండాను. కేశవులు వొంటిపైనగానీ, వాని కొడుకు వొళ్లపైనగానీ, దెబ్బ పడిందో, యింక మీకు నాకూ యే సంబంధమూ లేదు. యేదయినా గలాటా జరిగిందని

తెలిసిందంటే, మల్లంక మూడచింతలపల్లెకూ, సీమబాగిపాడుకూ తెగతెంపులయి పోయినట్టే... యింక అందరూ పోండి... పోలింగుటేషను చుట్టూరా యెవుడూ వుండద్దండి. మనేగారేడ? నువ్వు వూర్లోనే వుండావనేదానికి సాక్ష్యమేడుండాదో చూసుకుంటా వుండు''

రాజకుమా(రెడ్డి జావా దగ్గరికి నడిచి స్టాండు తీశాడు. అంతలో యేదో జ్ఞాపకం వచ్చినట్టుగా తలపైకెత్తి ''పీరారెడ్డి!'' అంటూ కేకేశాడు.

చిన్నపీరారెడ్డి వొక్క గెంతుతో రచ్చ దిగేశాడు.

''పోలింగాఫీసర్లకు భోజనాలు దెచ్చిపెట్టినావా?''

చిన్నపీరారెడ్డి ముఖం తెల్లబోయింది.

''భోజనమా?... మడి... మడి... నేను''

''యేందా సొణుగుడు? వూర్లోకొచ్చిన ఆఫీసర్లు మన గురించి యేమనుకుంటారు? యీ వూరికికూడా వొక పద్దతీ, వొక మట్టూ మర్యాదా వుండాయని అనుకోవాలన్నా పన్లేదా? యీ వూర్లోనే వుండానని అనుకోవాల్నా పన్లేదా? అన్నిటికీ నేనే బొట్టూ కాటికా పెట్టి చెప్పాల్నా? గంట రెండవతావుంది. యింకా మీల్సు రాకుండా వుంటే, వాళ్లు దేశమంతా నన్ను గురించి యేమని చెప్పుకోవాలని మీ వుద్దేశం?...''

వురుముల్లేకపోయినా, వర్షం రావచ్చునని, చిన్న పీరారెడ్డికి తెలిసినట్టు లేదు. ఖిన్నుడై పోయి నిల్చున్నాడు.

''చేసిన నిర్వాకం సాలుగానీ, యింటికాడికొచ్చి కారియర్ తీసకరా...''

జావా మొటర్‌బైక్ చుట్టూ నెలకొన్న శబ్దాన్ని వొక్క కిక్కుతో చీల్చిపారేసింది.

## 5

మూడు చింతలపల్లెలో పోలింగు స్టాపుకు రాజమర్యాదలు జరుగుతాయని తాను చెప్పినమాట ఆలస్యంగానయినా నిజమయినందుకు చిదంబరయ్య మహదానంద పడిపోయాడు.

సీమబాగిపాడునుంచీ చిన్న పీరారెడ్డి తీసుకొచ్చిన కారియర్లను ఖాళీ చేసేసిన తరువాత ''నేను వొంటెమాదిరి మడిసిని సార్! దొరికినప్పుడు రెండు మూడు దినాలకు సరిపోయినంత పట్టించేస్తాను. దొరకనప్పుడు రెండు మూడు దినాలు టీలతోనే నెట్టుకొచ్చేస్తాను. ఆ మాదిరి మనిషిని గాబట్టే యీ డ్యూటీలో చలాయించుకొస్తా వుండాను. సటపటమైనోడయితే తట్టుకునేవాడా యేమైనానా?'' అంటూ తృప్తిగా బీడీ ముట్టించాడు చిదంబరయ్య.

రచ్చబండపైన వొక మనిషి పడుకోడానికి సరిపోయే నీడ ఏర్పడింది. చిన్న పీరారెడ్డి చెట్టు మొదలునానుకుని అక్కడే భుక్తాయాసం తీర్చుకుంటున్నాడు.

రచ్చబండపైన సందడి తగ్గగానే ఎదురింటి ముసలివాడు మళ్లీ వరండాలోకి వచ్చేశాడు. యిప్పుడతను టేబుల్‌పైన డిసెక్షనుకు సిద్ధం చేసిన కప్పలాగా కుక్కి మంచానికి అతుక్కు పోయి వున్నాడు.

వీధి మలుపులో నల్లటి మట్టిరోడ్డుపైన కణకణా మిణమిణా మెరుస్తోంది యెండ.

కారియర్ గిన్నెల్ని సర్దిపెట్టేసిన తరువాత, మారయ్యగూడా పెరటివైపు తలుపు దగ్గర కూచుని విశ్రాంతి తీసుకుంటున్నాడు.

''యింక ఓట్లు పోలయ్యేది లేదని తేలిపోయింది గదా! అన్ని కవర్లకూ బాలట్ బాక్సుకూ సీల్లేసేసి రెడీ చేసేద్దామా సార్! వూరికే కూర్చునేదెందుకు?'' అని అడిగాడు దస్తగిరి.

''అదెలా కుదురుతుంది? మధ్యలో మళ్లీ ఫ్లయింగుస్క్వాడు లాంటిదొస్తే ఏమని సమాధానం చెప్తారు? అయిదువరకూ మనమిలాగే కూర్చోక తప్పదు'' అన్నాన్నేను.

''అవును సార్! సీల్ చేసే పని అయిదు దాటినాకే!'' అనేశాడు సుబ్బరాజు.

పనేమీ లేకపోవడంతో ఎన్నికల నిర్వహణను తెలియజేసే హాండ్‌బుక్ తీసుకుని తిప్పసాగాను.

సుబ్బరాజు బీడీని వెలిగించాడు.

దస్తగిరి టేబులుపైన తలపెట్టుకుని కునుకుతీసే ప్రయత్నంలో వున్నాడు.

చిదంబరయ్య రచ్చబండ దగ్గరికెళ్లి చిన్నపీరారెడ్డితో కబుర్లకు పెట్టుకున్నాడు.

అలా దాదాపు అరగంట గడిచిన తరువాత రచ్చబండ దగ్గరికో సైకిలొచ్చి ఆగింది.

పుస్తకాన్ని మూసిపెట్టేశాను.

సైకిల్‌పైన్నుంచి గెడకర్రకు బట్టలు వేసినట్టున్న ఆరడుగుల శాల్తీ కిందికి దిగాడు. బట్టతల వున్న అయిదారు పరకలు సైతం తెల్లబడిపోయాయి. సన్నగా, పొడుగ్గా, సొరకాయలాంటి ముఖం, చిన్న చిన్న కళ్లు, పొడవైన ముక్కు, గడ్డం చేసుకుని చాలారోజులైనట్టుంది. ఖద్దరు జుబ్బా, ఖద్దరు పంచె.

సైకిల్‌కు స్టాండయినా వేయకుండా చిదంబరయ్యతోనూ, చిన్నపీరారెడ్డితోనూ మాట్లాడు తున్నాడతను.

నిద్రకు వుపక్రమించబోతున్న దస్తగిరి ఆ ప్రయత్నాన్ని ఆపుకుని లేచి కూచుంటూ ''ఆయనెవులో తెలుసునా సార్?'' అంటూ ప్రశ్నించాడు.

మరోసారి పరీక్షించి చూసిన తరువాత తెలియదంటూ పెదవి విరిచాను.

''మీకు తెలుసునా సార్...'' సుబ్బరాజును అడిగాడు.

''ఎక్కడో చూసిన మనిషి మాదిరిగానే వుంది. గెవనంరావడం లేదు...'' అన్నాడు అతను.

''సిద్దవటం సుందరమూర్తి...''

యెక్కడో విన్నపేరులాగే వుంది. అయినా యెవరన్నదీ తెలియడం లేదు.

''సిద్దవటం సుందరమూర్తినే తెలియదా సార్! వోటు ముఖమైనా చూసినారా లేదా మీరు? యిప్పుడయినా బాగా కండ్లు తెరుసుకోని చూడండి సార్! వోటులో మొదటి పేరు పాపిలి యీశ్వరరెడ్డి. రెండో పేరు కోలా సుధాకర్రెడ్డి. మూడో పేరు యేందో చూడండి...''

గబగబా వోట్ల పుస్తకాన్ని తీసుకుని మూడో నెంబరు కోసం వెదికాను.

''సిద్దవటం సుందరమూర్తి. వొంటెగుర్తు...''

''కరెక్టు... వొంటెగుర్తే... సిద్దవటం సుందరమూర్తి. ఆయనే యీయన...''

''యెలక్షన్లో పోటీచేస్తున్న అభ్యర్థి సిద్దవటం సుందరమూర్తి యీయనేనా!'' నేను ఆశ్చర్యంలోంచీ తేరుకోలేదు.

జీపు దొరక్కపోతే పోయింది. కనీసం మోటారు బైక్లోనయినా రాలేదు. మందీ మార్బలం లేదు. అట్టహాసం లేదు. సైకిల్లో వొంటరిగా వచ్చేశాడు. అతగాడ్ని పోటీచేస్తున్న అభ్యర్థి అని అంటే యెవరు నమ్ముతారు!

''మీకయితే కొత్తేమోగానీ మాకు యీయన బాగా పాత మనిషే సార్! దుర్గవరం మునసబు కోర్టులో లాయరు. చెట్టుకింద ప్లీడరని పుస్తకాల్లో రాస్తారు చూడండి. ఆ బాపత్తు మనిషి. నల్లకోటేసుకొని కోర్టుకు పోతాడేగానీ, వొక్క కేసు గూడా వుండదు. తెలిసి తెలిసీ బుద్ధుండేవాడెవడూ యీయన దగ్గరికి కేసు తీసుకొనిపోడు సార్! యీయనేం జేప్తాడో జడ్జికి అర్థంగాక, జడ్జి మాటలు యీయనకర్థంకాక మధ్యలో కేసు తీసుకొని పోయినోడు ముండమోసి పోవాల్సిందే! కేసుల్లేవు గదా - అందుకని యెలక్షనులొస్తే చాలు - యే యెలక్షన్లని అడగద్దు. పార్లమెంటు యెలక్షనులయినా సరే, అసెంబ్లీ అయినా సరే, కడాకు మున్సిపాలిటీ అయినా సరే! నామినేషనేసి, సైకిలెత్తుకొని బయల్దేరేస్తాడు. యిప్పటికి ఎన్నిసార్లు పోటీచేసినాడో లెక్క తెలుసుకోవాలంటే, యీ నియోజకవర్గంలో యిప్పటికెన్నిసార్లు యెన్నికలు జరిగినాయో లెక్కతెల్సుకుంటే చాలు - మొత్తం అన్నిసార్లూ యీయన పోటీచేస్తానే వుండాడు. వొంటె, గుర్రమూ, యేనుగూ, కప్పూసాసరూ, గడియారం యింట్లాంటి గుర్తులనంతా మార్చి మార్చీ ట్రైజేసి చూసేసినాడు. పట్టువదలని విక్రమార్కుడూ, మహమ్మద్ గజనీ - ఆ తరువాత మన సిద్దవటం సుందరమూర్తీ - అదీ లిస్టు...'' దస్తగిరి నవ్వసాగాడు.

''పేరు నేను విన్నాను సార్! దుర్గవరంలో చానాసార్లు చూసినాను. కానీ చూస్తానే గుర్తుపట్టలేకపోయాను. యేదో వొక యెలక్షన్లోనయినా గెలిచుంటేగదా గుర్తుపెట్టుకునే దానికి?''. తానూ నవ్వేశాడు సుబ్బరాజు.

''ఆర్నెల్లముందు, అసెంబ్లీ యెలక్షన్లప్పుడు పేపర్లో ఫోటో గూడా యేసినారు. మీరు

చూసినారో లేదో సార్! యిన్నిసార్లు యెలక్షన్లలో పోటీచేసి వోడిపోయినోడు యీ ప్రపంచంలోనే లేడంట! గిన్నీస్‌బుక్‌లోకి యెక్కించాల్సిన పేరని రాసినారు...'' అన్నాడు దస్తగిరి.

''యెన్నికల్లో పోటీచేసి వున్నదంతా పోగొట్టుకున్నట్టున్నాడు. అందుకే పాపం ఒంటరిగా సైకిల్‌పైన వచ్చాడు'' అంటూ సానుభూతిని వ్యక్తం చేశాను.

''యెప్పుడయినా వుంటేగద సార్ పోగొట్టుకునేదానికి?'' దస్తగిరి యింకా నవ్వుతూనే వున్నాడు. ''పేరుకు వకీలనేగానీ సంపాదించింది యేమీ లేదంట. వుండేది అద్దె యింట్లోనే! అసలు డిపాజిట్టు కట్టేదానికి దుడ్డెట్లాస్తాదో యెవుడికీ తెలియదు. అది యెనక్కొచ్చే పని లేదని తెలిసి తెలిసి పోటీకి దిగేస్తాడు. బిడ్డా పాపా లేరంట! అడిగే వాళ్లెవురుండారింక? యెలక్షన్లు వస్తావుండాయంటే యీాయనకు పండగొచ్చినట్టే! డిపాజిట్ కట్టేసినాక, సైకిలెక్కేస్తాడు... అవునుగానీ ఆయన సైకిల్ను చూసినారా? హేండిల్‌కు పెద్ద ఎదురుకట్టె వుండాది...''

నిజమే! సుందరమూర్తి సైకిల్ హేండిల్‌కు వెదురుకర్ర కట్టిపెట్టబడి వుంది.

''ఆ కట్టెపైన మొన్నటిదాకా వొంటే బొమ్ముండే జండా యెగరతా వుండి వుంటుంది. మొన్నటి సాయంత్రం నుంచీ ప్రచారం చేయకూడదు కదా! అందుకని యిప్పేసుంటాడు. అట్లాంటి పనులన్నీ రూల్సు ప్రకారమే చేస్తాడు లెండి! యెలక్షనులప్పుడు సైకిల్‌పైన బయల్దేరతాడని చెప్పినాను గదా! మొత్తం నియోజకవర్గమంతా సైకిల్‌పైన్నే తిరగతాడు. వెనకాల స్టాండుపైన సరంజామా పెట్టుకొంటాడు. వూరూరా తానే గోడలపైన వోట్లేయమని రాసుకుంటాడు. పదిమంది కనబడతే చాలు! ఆడనే మీటింగ్ పెట్టేస్తాడు. వుంటే ఆ పదిమందీ పరుగెత్తుకొని పోయేటట్టుగా వూదరగొట్టేస్తాడు. పాంప్లెట్లు తానే పంచుతాడు. దాన్లో వుండే చాట భారతాన్ని చదివే వోపిక యెవడికుంటాది? మొదట్లో పోటీల్లో వుండే పెద్దోళ్లు పిలిపించి డిపాజిట్ లెక్క యిచ్చేస్తాము. విత్‌డ్రా చేసుకోమని దయాదాక్షిణ్యానికి పోయినారంట! యీ మొండోడు వింటేనా? మొత్తానికి బుర్రలో యేదో వొక నట్టు లూజయిందని అందరికీ తెలిసిపోయింది.''

''వొక దినమయినా సింహాసనమెక్కి దర్బారు చలాయించాలని ముసిలోడికి కోరికగా వుండేటట్టుంది'' సుబ్బరాజు కిసుక్కుమని నవ్వేశాడు.

''చూసేదానికి అట్టుంటాడుగానీ, ముసిలోడిది గెట్టి ప్రాణం సార్! రూల్సు గీల్సని మాట్లాడతావుండాడని రెండుమూడుసార్లు సున్నానికెముక దొరక్కుండా నలగుద్దిపారేసినారు. ఆస్పత్రిలో రెండు మూడు నెలలు వుండిపోయినాడు. అయినా తెపరాయించుకొని బయటికొచ్చేసినాడు'' కొనసాగించాడు దస్తగిరి.

''ముసిలోడు గట్టి పిండమే! లేకపోతే యెండ ఎట్లా మండిపోతా వుండాదో చూడండి. సటపటమైనోడు యీ ఎండలో వొక బూతునుంచీ యింకోబూతుకు సైకిల్లో తిరగతాడా? యీ వయసులో యీ మాదిరి తిరగతావుండాడూ అంటే అతడేదో పూనకంలో వున్నట్టే

లెక్క...'' తేల్చి పారేశాడు సుబ్బరాజు.

''సుందరమూర్తి మన బూత్‌పక్కకే వస్తావుండాడు. మీరు కాసేపు వూరికే చూస్తా వుండండి సార్! మనిసిలోనిదంతా ఖయాల్ బాపత్తు. మాట్లాడేదానికి మొదలు పెట్టినాడంటే చచ్చినా ఆపడు. కొంచెం కదిలించి వదిలిపెట్టేది మాత్రమే మన పని. ఆపైన మనకు రేడియోలూ టీవీలు అక్కర్లేదు. మంచి కాలక్షేపం...''

దస్తగిరి మాట్లాడుతూ వుండగానే అతడు బడిలోకి అడుగుపెట్టాడు.

''నమస్కారం సార్! నా పేరు సిద్ధవటం సుందరమూర్తి. పోలింగ్ యెట్లా జరగతావుందో చూద్దామని వచ్చినాను. ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్టు గూడా తెచ్చినాను...'' అతడు జేబులోంచి కాగితం వెలుపలికి తీయబోయాడు.

యెలక్షను బూత్‌లోకి అభ్యర్థీ, అతడి యేజెంట్లూ తప్ప మిగిలిన వారెవరూ వచ్చి కూచోడానికి వీలులేదు. అందుకని అతను తన ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్టు కూడా తెచ్చుకున్నట్టున్నాడు.

''మీరుకూడా సర్టిఫికెట్టు చూపించాల్నా? రండిసార్! మిమ్మల్ని తెలియనోడెవ్వడున్నాడు?'' అంటూ ఆహ్వానించాడు దస్తగిరి.

''పీవో ఎవరు? మీరేనా సార్...'' అని అడిగాడు సుందరమూర్తి.

అవునన్నాను.

''యీ వూరోళ్లు యెలక్షను బాయ్‌కాట్ చేసినారంట గదా?'' అన్నాడు.

ఆ విషయం తెలిసిగూడా బూత్‌లో యెలా పోలింగు జరుగుతుందో తెలుసుకోవాలని వచ్చాడన్నమాట!

''గంటముందు యీ రచ్చబండ దగ్గర పంచాయతీ జరిగిందంట గదా?''

యీ విషయం సైతం తెలుసుకున్నాడన్నమాట!

''పోలింగు బూత్ దగ్గర్లో పంచాయతీ జరుగుతోంటే చూస్తూ వూరుకున్నారా మీరు? అభ్యంతరం చెప్పలేదా?...''

అతడి దగ్గరినుంచి యిలాంటి ప్రశ్న ఒకటి దూసుకొస్తుందని నేను వూహించలేదు. వులిక్కిపడ్డాను. ''అభ్యంతరమా? నేను... నేను...'' తడబడ్డాను.

''పంచాయతీ పెట్టిన పెద్దమనిషితో, పోలింగు బూత్ దగ్గర జనం గుమిగూడితే పోలింగ్ కేన్సిల్ చేస్తానని చెప్పడం మీ బాధ్యత గదా! యెందుకు చెప్పలేదు?''

''నేను... నేనేమీ చెప్పగలను సార్? ఆయనొచ్చి బూత్ యెదురుగా కూర్చుంటే వేరే ప్రొటెక్షన్ అక్కర్లేదని పోలీసు యిన్‌స్పెక్టరు చెప్పి పోయినాడు...'' అన్నాను.

అతనేమీ మాట్లాడలేదు.

''సుందరమూర్తిగారూ మీరు పెద్దోళ్లు మీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. యిందులో

మేము చెయ్యాల్సిందేముంది చెప్పండి...? నిల్చునే వున్నారు... యెండనబడి తిరగతా వుండారు కాస్సేపు కూర్చోండి సార్!'' అన్నాడు సుబ్బరాజు.

సుందరమూర్తి బెంచీపైన కూర్చున్నాడు.

మారయ్య చేత తెప్పించిన చెంబుడు మంచినీళ్లు గుటగుటా తాగేశాడు.

''యింతవరకూ మీ గురించే అనుకుంటా వుంటిమి సార్!'' అంటూ మొదలుపెట్టాడు దస్తగిరి. ''యీసారయినా మీరుగెలిస్తే బాగుండునని అనుకున్నాము. మీ లైఫ్ ఆంబిషను తీరినట్లుంటాది గదా అని అనుకున్నాము''

యెంతగా దాచిపెట్టాలని అనుకున్నా అతడి గొంతుకలోంచీ వ్యంగ్యం స్పష్టంగానే ధ్వనించింది.

సుందరమూర్తి వొకటి రెండు నిమిషాలసేపు యేమీ మాట్లాడలేదు. వరసగా అందరినీ వోసారి పరీక్షగా చూశాడు. కాస్సేపు కిటికీలోంచి బయటికి చూపులు సారించాడు. తరువాత, కిటికీలోంచీ అవతలివైపుకు చూస్తూ పెదవులు విప్పాడు. 'గెలిచేది మాత్ర మొకటేగాదు నా లైఫ్ ఆంబిషను. యింకొకటి కూడా వుండాది'' అన్నాడు.

''యేందిసార్?...''. దస్తగిరే అడిగాడు.

సుందరమూర్తి తలతిప్పి అతడి వైపుకు చూస్తూ అన్నాడు. - ''యేంలేదు... వొకే యెన్నికలో, రెండు నియోజకవర్గాల్లో వోటెయ్యాలని వుండాది...''

అతడి మానసిక పరిస్థితిపైన నాకప్పటివరకూ వున్న అనుమానం తీరిపోయింది. సందేహం లేదు. యితడి బుర్ర పాడైపోయి చాలా రోజులైనట్లుంది.

దస్తగిరి మాత్రం మౌనంగా వుండలేకపోయాడు. ''అదెట్లా సాధ్యపడుతుంది సార్! వొక మనిషికి వొక వోటు. - అదీ రూలు... రెండు చోట్లలో వోటు వెయ్యాలంటే రూలొప్పదు'' అనేశాడు.

''రెండు చోట్లలో వోటెయ్యాలంటే కుదరదు. కానీ రెండు చోట్లలో వొకే మనిషి వొకే ఎన్నికలో పోటీచెయ్యవచ్చు. దానికి మాత్రం రూలు వొప్పుకుంటుందా?'' అడిగాడు అతను.

''వో! బ్రహ్మాండంగా చెయ్యొచ్చు. అసలు యీ బై యెలక్షను యెందు కొచ్చిందో తెలవదా మీకు!'' సుబ్బరాజు వివరించి చెప్పసాగాడు. ''పోయిన తడవ యెలక్షన్లప్పుడు యీ నియోజకవర్గంలో రామకోటిరెడ్డి పోటీచేసినాడు గదా! ఆయనకు డవుటొచ్చి యింకోచోటునుంచీ కూడా పోటీచేసినాడు. రెండు చోట్లా గెలిచేసినాడు. వొకదానికి రాజీనామా చెయ్యాలగదా! అందుకని యిక్కడ బైయెలక్షను పెట్టాల్సి వచ్చింది. కాబట్టి వొకే మనిషి రెండుచోట్లలో పోటీ చెయ్యొచ్చు. దానికి రూల్సు వొప్పుకుంటాది...''

''కానీ రెండుచోట్లలో వోటు వేసేదానికి రూలు వొప్పుకోదు. అంటే వోటేసే వాళ్లకు వొక రూలు, యెన్నికల్లో నిలబడేవాళ్లకు యింకో రూలు... అదీ పద్ధతి.... వెరీగుడ్...

యీ రెండు నియోజకవర్గాల్లోనూ రాంకోటి వోడిపోయ్యుంటే యేం జరిగి వుంటుందో తెలుసునా. మీకు?...''

''... ... ...''

''తెలియదా?... నేనే చెప్తాను... దేశంలో మంత్రి పదవికి దీటయ్యే పోస్టులెన్ని లేవు? స్థాయిలో మంత్రి పదవికి తీసిపోని ఒక మంచి పోస్టును దఖలుపరచి వుండేవారు...''

''కరెక్టుగా చెప్పినారు సార్! రాంకోటిరెడ్డంటే వంజాకాగాదు గదా!'' సుబ్బరాజు మెచ్చుకున్నాడు.

''నాకింకో డౌటుంటాది సార్!....'' అన్నాడు సుందరమూర్తి.

యేమిటన్నట్టుగా చూశాము.

''మన దుర్గవరం నియోజకవర్గంలో యెప్పుడూ ప్రధానమైన పోటీ రెడ్ల మధ్యనే! రెండు పార్టీలోళ్లూ రెడ్లనే నిలబెడతారు. అసలు యిప్పుడు జరగతావుండే యెన్నికల్లో - సుధాకర్రెడ్డి రాజకీయాల్లో ఆరితేరినోడు. వెంకట సుబ్బారెడ్డి రాజకీయాలకు కొత్త. అనుభవం లేని కుర్రోడు. యీ ప్రాంతంలోనే సుబ్రమణ్యం చౌదరి వుండాడు గదా! ఆయన్నెందుకు నిలబెట్టలేదు?....''

''అదెట్లా సాధ్యపడతాది సార్?'' యింత చిన్న విషయం కూడా తెలియదా అన్నట్లుగా నవ్వేశాడు దస్తగిరి. ''యీ పక్కంతా రెడ్ల రాజ్యం. నాయుళ్లు నిలబెడితే వోటెవుడు యేస్తాడు? రెడ్డయితేనే పోటీకి తట్టుకుంటాడు. అందుకనే రెండు పార్టీలోళ్లూ తెలివిగా రెడ్లనే నిలబెట్టినారు...''

''మన కాన్స్టిట్యూషన్ మొదట్లోనే మనది లౌకిక రాజ్యమని చెప్పినారు. మతం, కులం, లెక్కలోకి రాదన్నారు. మీరుకూడా చదివే వుంటారు. అయితే యెన్నికల్లో మాత్రం యెక్కడెక్కడ యేయే కులంవాళ్లు యెక్కువగా వుంటే వాళ్లనే పోటీకి నిలబెడ్తావుండారు. యిది న్యాయమేనా?''

''న్యాయమా అంటే న్యాయమనే చెప్పాల సార్! మనది లౌకిక రాజ్యమని అన్నారని. మన నియోజకవర్గంలో వొక సాయిబునూ, వొక క్రిస్టియన్నూ నిలబెట్టినారే అనుకోండి. యింక యిద్దరూ బతికి బట్టగట్టినట్టే! పోయినసారి పాలసముద్రం నియోజకవర్గం ఎస్సీకి అలాటయింది గదా! అక్కడేమయినా యెలక్షను జరిగినట్లునిందా? పెద్దపెద్దోళ్లంతా యేదో పైనుండే వాళ్ల పోటుకు పడలేక వొచ్చి పనిచేసినట్టు యాక్టు చేసినారు గానీ, వొకరైనా మనసుపెట్టి పనిచేసినారా? కాబట్టి కాంపిటీషను రంజుగా వుండాలంటే పోటీ సమవుజ్జీల మధ్యనే వుండాల సార్!''

సుందరమూర్తి కాస్సేపు మౌనంగా వుండిపోయాడు.

కిటికీలోంచీ రచ్చబండకేసి చూశాను.

చిన్నపీరారెడ్డి, చిదంబరయ్యా చింతచెట్టు నీడలో పులీ మేక ఆడుకుంటున్నారు.

దస్తగిరి మారయ్యను కేకేసి టీలు తెచ్చిపెట్టమని చెప్పాడు.

''డెమోక్రసీ అంటే యేందో నాకు యింకా సక్రమంగా అర్థంగాలేదు సార్! డెఫినిషను తెలుసునా మీకు?'' అని అడిగాడు సుందరమూర్తి.

''డెమోక్రసీ- అంటే - ప్రజాస్వామ్యం. అంటే ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల వలన యేర్పడిన ప్రభుత్వం సార్!'' విద్యార్థిలా గబగబా వొప్పజెప్పేశాడు సుబ్బరాజు.

''ప్రజలు అంటే యెవురు? నువ్వూ, నేనూ, ఆయనా అందరూ ప్రజలే కదా! మనలో యెవురయినా మన నియోజకవర్గంలో రామకోటిరెడ్డినిగానీ, వెంకట సుబ్బారెడ్డినిగానీ, సుధాకర్రెడ్డినిగానీ నిలబడమని అడిగినామా సార్?''

''మనం అడిగినామని నిలబడితే యింక నిలబడినోడి పని అయినట్టే సార్! పార్టీలో హైకమాండు నిలబెట్టాల... సీటియ్యాల. మధ్యలో మనం చేసేదేముంది?'' అన్నాడు దస్తగిరి.

''అంటే పవరు పార్టీ చేతిలో వుందంటారు. దానిపేరు ప్రజాస్వామ్యమని అంటారు. మనం కావాలని అనుకున్నోడు లీడరు కాలేడు. పార్టీ కావాలనుకుంటే యెవుడ్నయినా లీడర్ని చేసేస్తాది...''

''యెవుడినంటేవాడ్ని లీడర్ని చేసేదానికి పార్టీ యేమయినా వెర్రిబాగుల్దా సార్! కాండిడేట్‌కు మంచి పాపులారిటీ వుండాల... యెన్నికల్లో ఖర్చుపెట్టుకునే శక్తి వుండాల... అవసరమయితే యెదుటి పార్టీ వానితో బలాబలాలు చూసుకునే దమ్ముండాల...''

''డబ్బూ, గూండాయిజం - యివి రెండూ లేనోణ్ణి కాండిడేట్‌గా నిలబెట్టరని మీరంటారు. అంతేగదా! వోటేసే వాడికి యివేవీ అవసరం లేదా సార్?''

''ఓటరుకు కూడా దుడ్డుండాలనే రూలు పెట్టేది - న్యాయమా చెప్పండి సార్?...'' అతడి అమాయకత్వంపైన దస్తగిరికి నమ్మకమేర్పడిపోయినట్టుంది. వెటకారపు నవ్వు నవ్వుతూనే చెప్పుకుపోసాగాడు - ''దేశంలో పుట్టిపెరిగే ప్రతి మనిషికీ వోటు హక్కు వుండాల్సిందే గదా సార్! కులం మతం, జాతీగీతీ అనే తేడా లేదు. వుద్యోగం వుండినా లేకపోయినా ఫర్వాలేదు. దున్నుకునేదానికి భూమీ గీమీ వుండాల్సిన అవసరం లేదు. వుండేదానికి యిల్లు వున్నా పర్వాలేదు, లేకపోయినా పర్వాలేదు. అసలు వూరూరూ తిరిగి అడుక్కుతినే దొమ్మరోళ్లకు కూడా వోటువేసే హక్కుండాది...''

''కాండిడేటును సెలక్టు చేసేటప్పుడు మాత్రం దానికి లెక్క వుండాదా, గూండాయిజం చేసే దమ్ముండాదా అని చూస్తారు. కానీ ఓటరుకు ఏమీ లేకపోయినా ఫర్వాలేదు. వాడికికూడా ఆస్తీపాస్తీ వుంటేనే ఓటేసే పవరొస్తాదని అనుకోరు. వెరీగుడ్! ఈ రూలు కూడా బాగానే వుండాది సార్!....''

''మీకు అందరి కాండిడేట్లకు మాదిరిగా దుడ్డు లేదనీ, మందీ మార్బలమూ లేదనీ మొత్తం సెటప్‌నే యెగతాళి చేస్తే న్యాయమా చెప్పండి సార్?...చూడబోతే మీరు యీ సెటప్పే చెడ్డదని చెప్పేటట్టుండారు. ఆడలేనమ్మ మద్దెలవోడని చెప్పిందంటారు చూడండి

అట్లా వుండాది కథ!...'' ముసుగులో గుద్దులాట యెందుకు లెమ్మని సూటిగానే ప్రశ్నించేశాడు దస్తగిరి.

యెన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థిని అలా అతను నిలదీసి ప్రశ్నించడంతో నేను ఖంగారు పడిపోయాను. ఆఫ్టరాల్ వొక పోలింగు ఆఫీసరు! అంతంతేసి మాటలంటే కాండిడేటు వూరికే వుంటాడా? దస్తగిరికీవాళేదో మూడినట్టుంది...

సుందరమూర్తిలో పెద్దగా మార్పేమీ రాలేదు. నేను వూహించినట్టుగా అతడు కోపంతో వూగిపోవడం లేదు.

దస్తగిరి యింకా చిరునవ్వులు చిందిస్తూనే వున్నాడు. సుబ్బరాజు వాళ్లిద్దరినీ మార్చి మార్చి చూడసాగాడు.

కాస్సేపు మౌనంగా వుండిపోయిన తరువాత జేబులోంచి వొక కాగితం తీసి దస్తగిరి చేతికందించాడు సుందరమూర్తి.

''యేమిటిసార్ ఇది?...'' అని ప్రశ్నించాడు అతను.

''యెలక్షన్లో నాకయిన ఖర్చుకు లెక్క... పోటీలో నిలబడిన అభ్యర్థులు చివర్లో యెలక్షనుకు ఖర్చు యెంత పెట్టినారో లెక్క చూపించాల. అసెంబ్లీకయితే యింత, పార్లమెంటుకయితే యింత అని సీలింగుండాది. అంతకంటే యెక్కువ ఖర్చుచేస్తే ఆ అభ్యర్థి గెలిచినా ఒప్పుకోరు...''

''మీరు మొత్తం మూడువేలా యిన్నూరు ఖర్చుపెట్టినారని రాసినారు...''

''అంత ఖర్చు యెందుకయిందని మీకనుమానం కదా? పెయింట్‌కూ, భోజనానికీ, పాంప్లెట్లకూ - మొత్తం అంతయింది. మిగిలిన కాండిడేట్లు యెంత ఖర్చుపెట్టుంటారో మీకు తెలుసునా?''

''లక్షల్లో వుంటాది సార్!'' అన్నాడు సుబ్బరాజు.

''యెలక్షను రూల్సు ప్రకారం కరెక్టుగా, వాళ్లెంత చెప్పే అంతకంటే తక్కువగా ఖర్చుపెట్టింది నేనొక్కడ్నే! మిగిలినవాళ్లంతా తప్పులెక్కలే సబ్మిట్ చేస్తారు. అవన్నీ తప్పులెక్కలనే సంగతి అందరికీ తెలుసు. యెన్నికల్లో నాతోబాటూ పోటీకి నిలబడిన పెద్ద మనుషులెవ్వర్నీ నేను విత్‌డ్రా చేసుకోమని అడగలేదు. వాళ్లకు అదిస్తాననీ, యిదిస్తాననీ యెరజూపించలేదు. వోటర్లను వోటెయ్యకుండా అడ్డుపడలేదు. నేనుకూడా యీ దేశంలో పుట్టినోడినే గదా! నేను కావాలని అడగకపోయినా, నాకుకూడా ఒక కులం, జాతీ, మతమూ వుండాయి. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకున్నట్టుగా, నేనెప్పుడూ నా మతం, కులం, జాతి పేరిట వోట్లేయమని అడగలేదు. వొక గ్రూపుకూ యింకో గ్రూపుకూ ముళ్లు బిగించి, వాళ్లు తన్నుకొని చస్తావుంటే, నా పబ్బం గడుపుకోవాలని అనుకోలేదు. ప్రతి యెన్నికలప్పుడూ నేనే కరపత్రాలు ప్రింట్ చేసి పంచతావుంటాను. వొకదాంట్లోనయినా నేను నాతో పోటీచేసే కాండిడేట్ల ముఖానికి మసిపూసే పని చేసినానేమో చూపించండి. వోటర్లను పోలింగ్ బూత్‌లకాడికి కార్లలో, ట్రాక్టర్లలో తోలకొచ్చినానా నేను? యీ

ఘేరియాలో పోలింగు బూతుల్లో యెన్ని రకాల గొడవలు జరిగినాయి! నా మూలంగా పోలింగ్ కాన్సిలయిందని యెప్పుడయినా విన్నారా మీరు? యిప్పుడు నేను చెప్పిన పనులేమీ చెయ్యకుండా న్యాయప్రకారంగా యెంతమంది గెలిచినారు? యెలక్షను రూల్సు ప్రకారం నీతిగా నడిచినోడ్ని నేనొక్కడ్నే!''

టీ గ్లాసులతో మారయ్య బడిలోకొచ్చాడు.

టీ తాగుతున్నంతసేపు యెవరూ మాట్లాడలేదు.

సుందరమూర్తి తలపైకెత్తకుండా టీ తాగసాగాడు.

మేమందరమూ కళ్లయినా ఆర్పకుండా అతడినే గమనించసాగాము.

వేడివేడి టీ తాగగానే అతడి నుదుటిపైన చెమటబిందువులు పొటమరించాయి... వేలుకునే కలలు గంటున్నట్టున్న చూపులు... టీ గ్లాసును పట్టుకున్న చేయి వణుకుతోంది.

ఖాళీచేసిన గ్లాసును టేబుల్‌పైన వుంచేసిన తరువాత పెద్దగా వొక నిట్టూర్పు వదిలిపెట్టాడు.

తరువాత నింపాదిగా ప్రశ్నించాడు.

''మాకు నాయకులు కావాల... మాకు యెలక్షన్లు కావాల అని మీరెప్పుడయినా అడిగినారా సార్?...''

''... ... ...''

''మీరే గాదు... యెవ్వురూ అడగరు... యెలక్షన్లు మాత్రం వొకదాని తరువాత వొకటిగా వస్తానే వుంటాయి. పేపర్లలో వార్తలు భలే రంజుగా వుంటాయి. పార్లమెంటు యెలక్షను, అసెంబ్లీ యెలక్షను, జిల్లా ప్రజాపరిషత్, మండలం, సింగుల్‌విండో, చివరికి పంచాయితీ మళ్లా పార్లమెంటు యెన్నికలు... సంవత్సరానికి రెండు యెన్నికలయినా లేకపోతే యేం బాగుంటుంది? యెన్నికలు లేని సంవత్సరం వుప్పులేని కూడు మాదిరిగా చప్పగా వుంటాది. అయితే యిన్ని యెన్నికలు యెవురకోసమో మీరే చెప్పండి సార్... ప్రజల కోసమా? పోటీచేసేవాళ్ల కోసమా? మామూలు ప్రజలకు తిండి గుడ్డ నీడా కల్పించేదాని కోసమా? లేకపోతే పెద్దోళ్లు పదవులు పంచుకునే దాని కోసమా? అసలు యీ మధ్యనే నాకో కొత్త సంగతి తెలిసింది సార్...'' రహస్యంలా గొంతు తగ్గించి చెప్పసాగాడు సుందరమూర్తి. ''అసలు ప్రతి వూళ్లోనూ స్కూళ్లు యెందుకు కట్టించినారో తెలుసునా? ప్రతి స్కూలుకూ టీచర్లను యెందుకు అపాయింట్ చేసినారో మీకు తెలుసునా? స్కూలు బిల్డింగ్ లేకపోతే పోలింగు బూత్ యెక్కడ పెట్టేది సార్! అయ్యవార్లు లేకపోతే పోలింగు స్టాఫ్ యింతమంది యెక్కడనుంచీ దొరకతారు?...''

మేమెవ్వరమూ మాట్లాడలేదు.

అయిదు నిమిషాల తర్వాత సుందరమూర్తి పైకి లేచి నిల్చుంటూ ''నేను వెళ్తాను సార్!

గంట నాలుగయిపోయినట్టుంది. వీలయితే యింకో బూత్ గూడా చూడాల...'' అన్నాడు.

''యిన్ని మాటలు మాట్లాడినోళ్లు, మీరు యెలక్షన్లలో పోటీ యెందుకు చేస్తావుండారు సార్?'' దస్తగిరి బులెట్‌లాంటి ప్రశ్నను సూటిగా గురిచూసి ప్రయోగించాడు.

అతడికేసి చూస్తూ చిరునవ్వు నవ్వాడు సుందరమూర్తి. తరువాత పెదవులు విప్పి నింపాదిగా జవాబు చెప్పాడు:

''పోటీ చెయ్యకుంటే నేనున్నానన్న సంగతి యితరులకెలా తెలుస్తుంది?''

## 6

పోలింగు ముగిసిన వెంటనే చిన్న పీరారెడ్డి సీమబాగిపాడు కెళ్లిపోయాడు.

కవర్లకూ, బాలెట్ బాక్సులకూ సీళ్లువేసేసి, పోలింగు సామాన్లంతా గోనెసంచిలో కట్టగట్టి పెట్టేశాము.

అప్పుడు సమయం ఆరుగంటలయింది.

తన పని ముగియడంతో దస్తగిరి మా దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

కుర్చీలు బడి ముంగిట, వీధిలో వేసుకుని లారీ కోసం యెదురుచూస్తూ కూర్చున్నాము.

''మాకంటే మీ పనే మేలు సార్! యీ సంచుల్ని తాలూకాఫీసులో హండోవర్ చేసేస్తే మీ పనయిపోతాది. మాకట్లా కుదరదు గదా! రేపీవాళకు యేడుంటామో మాకు తెలియదు. కౌంటింగ్ దగ్గర ప్రొటెక్షనుండమంటే సరేననాల. లేకపోతే రీపోలింగు స్టేషన్లకు పొమ్మంటే మూగెద్దు మాదిరిగా తలూపాల...'' అంటూ వాపోయాడు చిదంబరయ్య.

''నాకుగూడా కౌంటింగ్ డ్యూటీ వేస్తారేమో చిదంబరయ్యా! రిసీవింగ్ సెంటర్‌కు పోయేదాకా యే సంగతీ తెలియదు'' అన్నాడు సుబ్బరాజు.

యెండ తీవ్రత బాగా తగ్గింది.

వీధిలో జనం సంచారం మొదలయింది.

బోరింగు దగ్గర్నుంచీ కొందరాడవాళ్లు నీళ్ల కడవలు మోసుకెళ్తున్నారు.

రచ్చబండపైన అయిదారుమంది కుర్రవాళ్లు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

అప్రయత్నంగా నా కళ్లు శివయ్య కోసం వెదికాయి.

ఆ గుంపులో అతడు లేడు.

మధ్యాహ్నం జరిగిన పంచాయతీ పరిణామమేమిటో యింకా తెలియలేదు. శివయ్యనేవిధంగా శిక్షించాలనే విషయంపైన గ్రామస్తులే నిర్ణయం తీసుకున్నారో తేలేదు.

క్రమంగా చీకటి పడిపోయింది.

వీధికవతల మట్టిమిద్దెల్లో విద్యుద్దీపాలు గుడ్డిదీపాల్లా వెలుగుతున్నాయి.

''లారీ నిన్న మాదిరిగా యే డొంకలో తగులుకునిందో సార్! యీవేళ దాకా రాలేదంటే దోవలో అది కాళ్లెత్తేసినట్టే !'' అన్నాడు చిదంబరయ్య.

''పొద్దున్నే కనిపిస్తానని చెప్పిపోయిన పెద్దమనిషి. ఆ లైనినిస్పెక్టరు యిప్పటిదాకా అయిపు లేడు. యేమయిపోయినాడో ఏమో!'' సుబ్బరాజు గొణుక్కుంటున్నాడు.

లారీ కోసం వీధి మలుపుకేసి చూసీ కళ్లు కాయలు గాచిపోతున్నాయి.

యిక యీ రాత్రికిక్కడే శవజాగరణ తప్పదేమోనన్న నిర్ణయానికి రాబోతుండగా రాత్రి పదిగంటల సమయంలో లారీ మూడుచింతలపల్లె చేరుకొంది.

పోలింగు మూటను లారీ బాడీలోకెక్కించాక, మేముగూడా లారీ పైకెక్కాము. లోపల అయిదారుమంది ప్రిసయిడింగ్ ఆఫీసర్లు, పిల్లల్ని గుండెలకెత్తుకున్న కోతుల్లా పోలింగు మూటలకతుక్కుపోయి కనిపించారు. స్టెప్నీటైరుపైన పోలీసుల గుంపు ధూమపానోత్సవం జరుపుకుంటున్నారు.

''యిది నిన్న మనల్ని తీసుకొచ్చిన లారీనేనంట సార్! నిన్న రాత్రి ఆడేడ్నో డొంకలో తగులుకునింది గదా! రోడ్డుపైకి లాగి రిపేరు గిపేరు చేసేటప్పటికీ సాయంత్రం యేడయిందంట! అందుకే లేటు...'' అప్పటికి తాను వాకబు చేసి తెలుసుకున్న విషయాన్ని సుబ్బరాజు తెలియజేశాడు.

మూడుచింతలపల్లెలో నిద్రపోతున్న జనమంతా వులిక్కిపడి పైకి లేచి కూచునేటట్టుగా వోసారి ఘీంకరించిన తరువాత లారీ బయల్దేరింది.

చుట్టూ చీకటి... అప్పుడప్పుడూ లారీలోని జనాల్ని పలకరించే తుమ్మచెట్ల కొమ్మలు... పైన నక్షత్రాల చాందినీ... డ్రైవరు సరైన త్రోవలో వెళ్తున్నాడో లేదో గూడా తెలియడం లేదు. యీ ప్రయాణంలో పోలింగు మూటల్ని సంరక్షించుకుంటూ గమ్యం కోసం యెదురుచూస్తూ కూర్చోవడమొక్కటే మా అస్తిత్వపు లక్ష్యం.

కోటకొమ్మలపల్లెలో లేబరాఫీసరు లారీ యెక్కాడు.

''యేం సార్! పోలింగెట్ల జరిగింది?'' అని అడిగాడు చిదంబరయ్య.

''అంతా పీస్‌ఫుల్‌గా జరిగింది'' లేబరాఫీసరు ఉత్సాహంగా సమాధానం చెప్పాడు. కొంచెం గొంతు తగ్గించి ''మా బూత్‌లో కాంపిటీషన్ చానా టఫ్‌గా వునింది సార్! యిద్దరు యేజెంట్లూ టీ తాగేదానికి గూడా బయటికి పోకుండా బూత్‌లోనే వుండిపోయినారు. సాయంత్రం నాలుగుకంతా పోలింగు ఐపోయింది. డెబ్బై పర్సెంటు పోలయింది. లాస్ట్‌లో యిద్దరేజెంట్లూ తలా యిరవై అయిదు వోట్లు వేసుకుంటామని అడిగినారు. మనదేం పోయిందనుకొని వేసుకోమని చెప్పినాను. ఆ దెబ్బతో వాళ్లు అయిసయిపోయినారు. నేను లారీ యెక్కేదాకా దగ్గరే కూర్చొని ఆ మాట యీ మాటా చెప్తా వున్నారు సార్!'' అన్నాడు.

ప్రొద్దున్నుంచీ వున్న టెన్షన్ తగ్గడంతో ప్రిసయిడింగ్ ఆఫీసర్లూ, పోలింగ్ ఆఫీసర్లూ

వుత్సాహంగా కనిపించారు.

తన గోడు చెప్పుకోవడానికి తోడు దొరకడంతో మరో ప్రిసయిడింగ్ ఆఫీసరు తన పెదవి విప్పాడు - ''మా బూత్‌లో యీ పొద్దు పోలింగ్ కాన్సిలయిందనే అనుకున్నాను సార్! మధ్యానం రెండు గంటలప్పుడు బూత్ బయట దొమ్మీ జరిగింది. రెండు పార్టీలూ కట్టెలూ, బరిసెలూ యెత్తుకొని నువ్వెంతంటే నువ్వెంతని అనుకున్నారు. బూత్‌లో వోటర్లు కొందరు వోట్లు యేజెంట్ల. ముందర్నే గుద్దేసి బాలట్ బాక్సులో యేసేదానికి మొదలు పెట్టినారు. కనిపించకుండా వోటేస్తే యెవురికి యేస్తారో యేమోనని ఆ వూళ్లో డవుటొచ్చిందంట! అందుకని అందర్నీ బయట్నే గుద్దెయ్యమని తీర్మానం జెప్పినారంట! యీ సంగతి తెలుసుకొని కాండిడేటే వొచ్చేసినాడు. పోలింగ్ ఆపేయమని యిద్దరు ముగ్గురు లోపలికొచ్చి నాతో చెప్పినారు. యింక రేపుగూడా మనకీ డ్యూటీ తప్పదని గునుస్తూ కూర్చుంటిని... లాస్ట్‌లో యెట్నో అంతా సద్దుమణిగిపోయింది...''

దొమ్మీ జరిగిన తరువాత వోటర్లు వోట్లు రహస్యంగా వేశారో లేదో అతడు చెప్పలేదు. ఆ సంగతిని అడిగే వోపరికెవరికీ వున్నట్టు లేదు. మరో ప్రిసయిడింగ్ ఆఫీసర్ తన బాధను వ్యక్తం చేయసాగాడు. ''మా బూత్‌లో యిద్దరు యేజెంట్లుండినారని పేరేగానీ దాన్లో వొక డమ్మీ సార్! అంతా వన్‌వే ట్రాఫిక్ - వొక్కడే యెన్నిసార్లొచ్చి వోటేసినా అడిగేవాడు లేడు. చూసి వోర్చుకునేదానికి నావల్లకాలేదు. ఆకాడికి యింత అన్యాయమా అని అడిగేయనే అడిగేసినాను. మీకెందుకు మీరు వూరికే కూర్చోండని ఇద్దరేజెంట్లూ మొరుసుకోని చూసినారు. సెంటు పర్సెంటు పోలయితే అందరికీ డౌటొస్తాదని చెప్పిన తర్వాత వొక అయిదు పర్సెంటు వొదిలేసినారు...''

''మా బూత్‌లో పోలయ్యింది వొకే వోటు సార్!'' అందరూ యెలక్షన్ను బాయ్‌కాట్ చేసినారంట...'' సుబ్బరాజు చెప్పుకుపోతున్నాడు.

వున్నట్టుండి పోలీసుల్లో వొకతను పెద్దగా గొంతు చించుకుంటూ పాట పాడసాగాడు. యింకో పోలీసు ఆ చీకట్లోనే లేచి నిల్చుని డాన్సు చేయసాగాడు. చెట్లకొమ్మలు విసురుగా తగిలినప్పుడల్లా అతని నృత్యం మరింత ఉత్సాహంగా కొనసాగింది. ప్రిసయిడింగ్ ఆఫీసర్లు సైతం కాస్సేపు తమ కబుర్లు కట్టిపెట్టి నృత్యాన్ని చూడసాగారు.

పది నిమిషాలసేపు నృత్యం చేసిన తరువాత అతడు అలసిపోయినట్టున్నాడు. చెమటలు కార్చుకుంటూ కూలబడిపోయి బీడీ వెలిగించుకున్నాడు.

''లారీ లేటుగావచ్చిందిగదా! మా యేజెంట్లు అప్పటికప్పుడు మీల్స్ యేర్పాటుచేసినారు. యెనిమిదికంతా భోంచేసినాను'' లేబరాఫీసరు ఖుషీగా మొదలుపెట్టాడు

''కడుపులో యెలకలు తవ్వతా వుండాయి సార్! మధ్యానం తిన్న తిండి...'' మరో వ్యక్తి విచారాన్ని వెల్లడించాడు.

''యీ లారీ దుర్గవరం చేరేదెప్పుడు? అప్పటికి వూర్లో హోటళ్లు అన్నీ మూసేసుంటారు. యింక భోజనం సంగతి మర్చిపోవాల్సిందే! రేపు తెల్లారి టిఫినే యింక

మనకు దొరకబోయేది....'' మరో వ్యక్తి వాపోయాడు.

మాట్లాడీ మాట్లాడీ చివరకి అందరూ పోలింగ్ సంచీలపైన సోలిపోయారు.

పోలీసు బృందం మాత్రం కేరింతలు కొడుతూనే వున్నారు.

రాత్రి వొంటిగంటకు లారీ దుర్గవరం చేరింది.

జూనియర్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్ యేర్పాటయిందట!

వూరంతా మాటుమణిగిపోయినా, జూనియర్ కాలేజీమాత్రం విద్యుద్దీపాల్ని తగిలించుకుని మేలుకునే వుంది. రిసీవింగ్ కౌంటర్లలో హడావుడి కొనసాగుతూనే వుంది, రకరకాల గొడవలవల్ల పోలింగ్ కాన్సిలయిన బూత్‌లలో, మరునాడు పోలింగు నిర్వహించడం కోసం మరికొందరు బిచాణా సర్దుకుంటున్నారు.

''సార్, సార్! వొకమాట'' సుబ్బరాజు నన్నొక మూలకు లాక్కుపోయాడు. ''ఎక్స్ట్రా ఖర్చుల కోసం పది రూపాయలు యిచ్చినారుగదా! దాన్నేం చేసినారు?'' అని అడిగాడు.

''దాన్నేం చేయలేదు సార్! అలాగే వుంది. వాపస్ చేసేద్దాం..'' అన్నాను.

''యింత పిచ్చోళ్లు, యీ లోకంలో బతకలేరు సార్'' సుబ్బరాజు నవ్వేశాడు. ''యీ రోజు టీలూ, కాఫీలకూ ఖర్చుపెట్టినారు గదా! అదంతా ఖర్చుగాదా! ఆ పదీ యిట్లియ్యండి. మీకయిదూ, నాకయిదూ... తెల్లకాగితమూ, పేనా యిట్లియ్యండి...''

తెల్లకాగితంపైన అప్పటికప్పుడో వోచర్ తయారుచేసేశాడు. పెద్దవెంకటాపురం నుంచి షేక్ బుడాన్ సాహెబనే కిరాణ కొట్టువాడు తాను సప్లయి చేసిన పెట్రమాక్సు దీపానికి కిరోసిన్‌కూ పది రూపాయలు ముట్టినట్లుగా వోచరిచ్చాడు. కింద తానే సంతకం చేసేశాడు సుబ్బరాజు.

''పెదవెంకటాపురంలో షేక్ బుడాన్ సాహెబ్ అనే వ్యక్తి వున్నాడా సార్!'' అని అడిగాను.

''వుండాడో లేదో యెవుడు చూసొచ్చినాడు? యీ యెలక్షను లెక్కకు ఆడిటింగా పాడా? యెవుడికెంత దొరికితే అంతా బీజారు కోవాల్సిందే...''

పది రూపాయలు తీసి అతడి చేతిలో పెట్టాను.

పోలింగు సరంజామానంతా రిసీవింగ్ కౌంటర్లలో జమకట్టేసిన తరువాత, సుబ్బరాజు మరోసారి హెచ్చరించాడు.

''లైనినస్పెక్టరు యీడ్నే వుండాడంట! డ్యూటీ చేసిందానికి లెక్క తీసుకునేది మర్చిపోవద్దండి సార్!...''

## 7

మరునాడు కొన్ని వూర్లలో రీపోలింగు జరపవలసి రావడంతో కౌటింగ్ వొక రోజు వాయిదా పడింది.

కౌంటింగ్ జూనియర్ కాలేజీలోనే యేర్పాటుచేశారు. కాలేజీకి వరుసగా అయిదారు రోజుల సెలవు ప్రకటించారు.

కౌంటింగ్ జరుగుతున్న నాటి సాయంకాలం కాలేజీ క్యాంటీను కెళ్లాను. కాఫీ తాగుతుండగా సుబ్బరాజు కాంటీనుకొచ్చాడు.

''కౌంటింగ్ డ్యూటీ వేసినారు సార్! కౌంటింగ్ ఫైనల్ స్టేజీలోకొచ్చింది. నా పనిప్పుడే ఐపోయింది. కాఫీకోసం యిట్లొచ్చినాను'' అన్నాడు.

''రిజల్ట్సు డిక్లేర్ చేసేసినారని నాతోఅన్నారే యెవరో!'' అంటూ సందేహం వెలిబుచ్చాను.

''ఆ సంగతి నాకు తెలియదు సార్! నేనిప్పుడే కౌంటింగ్ దగ్గరినుంచీ సరాసరి వస్తావుండాను...'' అన్నాడు సుబ్బరాజు.

''కౌంటింగ్ చేస్తున్న మీకు గూడా తెలియకుండా రిజల్ట్సు డిక్లేర్ యెలా చేస్తారండి?'' విస్తుపోయాను.

''కొన్నిసార్లు కౌంటింగ్ జరగతా వుండగానే రిజల్ట్సు డిక్లేర్ చేసెయ్యమని పైన్నుంచీ ఆర్డరొచ్చేస్తాది సార్! అప్పుడు కౌంటింగ్ ఆఫీసరు డిక్లేర్ చేసేస్తాడు...

''అదెలా కుదురుతుంది... వాళ్ల డిక్లరేషను తప్పయితే...''

''అదంతా మేము చూసుకుంటామని పైన్నుంచి హామీ వస్తాది సార్! కౌంటింగ్ ఆఫీసరు యేం చేస్తాడు చెప్పండి? డిక్లేరు చేయకుంటే తన గతేమయితుందోనని భయముంటాది గదా? డిక్లేర్ చేసేస్తాడు. యీ సంగతి యెవ్వరైనా తెలుసుకున్నా రనుకోండి. కోర్టుకెక్కుతారు. కోర్టులో ప్రొసీడింగ్సు జరగాల... దానికి టైం పడతాది. కొంచెం గడువు దొరికితే తలలే మార్చెయ్యచ్చు. యింక లెక్కల్ని మార్చేది వొకలెక్కా!''

కాఫీలు టేబుల్పైకి వచ్చాయి.

కాఫీ తాగుతూ ''కౌంటింగ్లో పోవిడిగా తెలిసింది సార్! మూడుచింతలపల్లెలో పోలింగ్ బాయ్కాట్ చేసినందుకు వో మతలబుంది...'' అన్నాడు సుబ్బరాజు.

యేమిటన్నట్లుగా చూశాను.

''రాజకుమార్రెడ్డికీ కాండిడేట్లకూ రేటు దగ్గర పేచీ వచ్చిందంట...''

''రేటంటే?!''

''వూళ్లో వుండే మొత్తం వోట్లన్నీ మీకేపడేటట్టు చూస్తాను. నాకెంతిస్తారు? అదీ కొశ్చను. ఆన్సరు దగ్గర యేకాభిప్రాయం కుదర్లేదంట! కేండిడేట్లిద్దరూ రాజకుమార్రెడ్డంటే తమాషా అనుకున్నారు. తన తడాకా చూపించాలని రాజకుమార్రెడ్డి బరిగీసి కూచున్నాడు. అదీ సంగతి...''

''యీ సంగతి ఆ వూళ్లో జనానికి తెలియదా?''

''యెందుకు తెలియదు సార్! యింత దూరంలో వుండే మనకే పోవిడి తెలిసింది గదా!

తెలిస్తే మాత్రం ఆయన మాట కాదనే ధైర్యమెవుడికుంటాది చెప్పండి?...''

''శివయ్యకేం శిక్షేసినారో మీకేమయినా తెలిసిందా సార్?'' అని అడిగాను.

''శివయ్యంటే మన బూత్‌లో వోటేసిన పిల్లోడేనా సార్?''

అవునన్నట్లుగా తలవూపాను.

''అదేమో నాకు తెలియదు సార్. రాజకుమార్రెడ్డి పట్టు వుడుంపట్టు మాదిరని చిదంబరయ్య చెప్పినాడు గదా! చేతులకు మసిగాకుండా యేందో చేసేవుంటాడు...!''

''యే శిక్ష విధించి వుంటారు?''

రాజకుమార్రెడ్డి దర్బారులో తప్పు చేసిన వాడికి యెలాంటి శిక్ష విధిస్తారో చెప్పగల వారెవరు?

ఖాళీ గ్లాసును టేబుల్‌పైన వుంచుతూ ''పెద్దరెడ్డి మాటకెదురుచెప్తే పుట్టె మునుగుతుందని తెలిసిగూడా శివయ్య వోటేసినాడు గదా! వాడు వోటెవురి కేసినాడో తెలుసునా సార్?'' అని ప్రశ్నించాడు సుబ్బరాజు.

శివయ్య వోటెవరికి వేశాడు? యీ సందేహం నన్ను మొదటినుంచీ వెంటాడుతూనే వుంది. తెలుసుకోవడం ఎలా?

''ఆ సంగతి మనకెలా తెలుస్తుంది సార్?'' అని అడిగాను.

''వొకేవొక బాలెట్ పేపరుండే బాలట్ బాక్సు మన బూత్‌దేగదా సార్! అట్లాంటి బాక్సు మొత్తం నియోజకవర్గంలోనే యింకొకటి లేదు. ఆక్సిడెంటల్‌గా నేను కౌంట్ చేసిన డెస్క్ దగ్గరికే వచ్చింది మన బాక్సు...''

నా ఉత్కంఠను పెంచడం కోసమన్నట్టుగా వో నిముషం సేపు ఆగాడు సుబ్బరాజు.

''బాలట్ పేపరు వెనకాల మీ సైన్ గూడా వుంటాది గదా! కాబట్టి అది శివయ్య వేసిన వోటని స్పష్టంగా తెలిసిపోయింది''

''... ... ...''

''సిద్దవటం సుందరమూర్తి మాదిరిగా యీ శివయ్యగాడికి మైండ్ లూజయినట్టే వుండాది సార్! వాడు వోటు కాగితంపైన వోటేసిన తీరు చూస్తే యెవుడైనా వానికి పిచ్చిపట్టి వుంటాదని చెప్పేయచ్చు. వొకటిగాదు, రెండుగాదు, బాలట్ పేపర్‌నిండా యెట్లబడితే అట్లా ముద్రలు గుద్ది పారేసినాడు. అదొక కాగితమని వాడనుకున్నట్టు లేదు. వొంటరిగా శత్రువు చేతికిదొరికితే వుతికిపారేస్తారు చూడండి! ఆ మాదిరిగా దానిపైన ఇష్టమొచ్చినట్టుగా గుద్ది పారేసినాడు. మతి భ్రమించినోడు తప్పితే మరొకరు చేసే పనేనా యిది?''

సమాధానమేమని చెప్పగలను?

మౌనంగా పైకిలేచి క్యాంటీను బయటికొచ్చేశాను.

గదికేసి నడవసాగాను.

యిరవైకీ యిరవై అయిదుకూ మధ్య వయస్సు... నల్లటి పట్టుకుచ్చులాంటి గడ్డం... నూనె మరచిన జుట్టు... పెద్దకళ్లు... కొనతేలిన ముక్కు... యెరుపూ తలుపు రంగుల గళ్ల కాటన్ చొక్కా... గళ్లలుంగీ... రచ్చబండ ముందునిల్చుని రాజకుమార్‌రెడ్డి ప్రశ్నకు జవాబు చెప్పడానికి నిరాకరించే తెగువ... శివయ్య ఆకారం పెద్ద ప్రశ్నార్ధకంలా నా మనసులో మెదిలింది.

*(నవంబర్ 1988, స్వాతి మాసపత్రిక)*